
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 సెప్టెంబరు 2025



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు



సీఎంకు హారతులు పడుతున్న మహిళలు



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి



ఫొటో గ్యాలరీని తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్



సీఎంకు స్వాగత ఫ్లెక్సీలు



బైక్‌పై కార్యకర్తల ఉత్సాహం



కడప, రాజంపేట, కోడూరులకు గాలేరు-నగరి నీరు

- రాజకీయాలకతీతంగా రాజంపేటను అభివృద్ధి చేస్తాం
- అన్ని రకాలుగా ఆలోచించి రాజంపేట జిల్లా కేంద్రంపై నిర్ణయం
- ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- అన్నమయ్య ప్రాజెక్టును నిర్మిస్తాం

రాజంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమను రతనాల సీమగా చేయడంలో భాగంగా కడప, రాజంపేట, రైల్వేకోడూరులలో గాలేరు-నగరి నీరు పారిస్తామని, రెండు రోజుల కిందట మదనపల్లె, పీలేరు మీదుగా కుప్పానికి సాగునీరు తెచ్చినట్లే వచ్చే ఏడాది నాటికి ఈ మూడు ప్రాంతాలకు నీరు తీసుకువస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. సోమవారం రాజంపేట మండలం బోయనపల్లె ప్రజావేదిక సభలో చంద్రబాబు మాట్లాడుతూ రాయలసీమ రాయలు ఏలిన ప్రాంతమని, ఇది రాళ్లసీమ కాదు రతనాల సీమ అన్నారు. రాయలసీమ ప్రాంతానికి సాగునీటితో పాటు పరిశ్రమలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని రతనాల సీమగా మారుస్తామన్నారు. గత పాలకులు రాయలసీమను రాళ్లసీమగా మార్చి రక్తం పారించారని, మేము వచ్చిన తర్వాత సాగునీరు పారిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అప్పు చేసి పప్పుకూడు తినే చందంగా 10 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని జీతాలు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని, అదే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద సృష్టిస్తూ అటు సంక్షేమాన్ని, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ అటు రాజధాని అమరావతిని, పోలవరాన్ని నిర్మిస్తూ పీ4 పథకాన్ని అమలుపరుస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. రాజంపేటలో ఎమ్మెల్యే లేరని అనుకోవద్దని, రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును త్వరలో నిర్మిస్తామని తెలిపారు.

రాజంపేట ప్రాంతంలో వ్యవసాయం తగ్గిందని, ఉద్యాన పంటలు పెరిగాయన్నారు. రాజంపేటలో డెయిరీ, పశు సంపద బాగా పెరిగిందన్నారు. తన హయాంలోనే ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని ఆంధ్ర భద్రాద్రిగా ప్రకటించి టీటీడీలో విలీనం చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేసి ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా చేశామన్నారు.





ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, హాజరైన ప్రజలు

మార్గదర్శకులను ఆదర్శంగా తీసుకోవాలి : సీఎం



పేదలను దత్తత తీసుకున్న గీతాంజలి రమణ, సుబ్రహ్మణ్యం, తదితరులతో సీఎం చంద్రబాబు

రాజంపేట మండలం బోయనపల్లెలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమంలో ఆర్థికంగా బాగున్నవారు పేదలైన ఇరుగు పొరుగు వారిని ఆదుకోవాలని, ఆ కుటుంబాలను దత్తత తీసుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ, తాళ్లపాక గ్రామానికి చెందిన ఉద్దండం సుబ్రహ్మణ్యంలు ముందుకు వచ్చి పేదలను ఆదుకోవడం అభినందనీయమన్నారు. పేద విద్యార్థిని కల్యాణి కుటుంబానికి ఇల్లు కట్టించి కల్యాణి ఎదుగుదలకు, అమ్మాయి క్రీడా రంగంలో రాణించడానికి ప్రస్తుతం ఆ కుటుంబాన్ని దత్తత తీసుకున్న రమణ అభినందనీయులన్నారు. అదేవిధంగా యేసమ్మ పేద కుటుంబాన్ని వారి నలుగురు పిల్లలను దత్తత తీసుకుని వారి జీవనానికి తోపుడు బండ్లు, వారు చదువుకోవడానికి చదువు, ఇతర ఆర్థికసాయం చేస్తామని ముందుకు వచ్చిన సుబ్రహ్మణ్యంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మార్గదర్శకులు రమణ, సుబ్రహ్మణ్యలు మాట్లాడుతూ మీరు ప్రవేశపెట్టిన పీ4 పథకం వల్ల పేదలను ఆర్థికంగా బాగా ఉన్న ఉన్నత కుటుంబాలు దత్తత తీసుకుని ఆదుకోవడం వల్ల ఆర్థిక అసమానతలు తొలగిపోతాయన్నారు. మీ పిలుపు మేరకు మేము దత్తత తీసుకున్న కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు.

విద్యార్థిని కల్యాణి మాట్లాడుతూ తమ గ్రామం బోయనపల్లె అని, తమ తండ్రి శేఖర్ కూలీ పని చేసుకుంటాడన్నారు. తాను డిగ్రీ తొలి సంవత్సరం చదువుతూ బ్యాడ్మింటన్‌లో స్టేట్ ర్యాంకర్‌గా గుర్తింపు పొందానన్నారు. అయితే తనకు ప్రోత్సాహం లేక క్రీడా రంగంలో ముందుకు పోలేకపోతున్నామన్నారు. ఈ సమయంలో తన పీజీ చదువుకు, క్రీడాభివృద్ధికి తమ కుటుంబానికి ఆర్థిక సాయం చేయడానికి గీతాంజలి రమణ ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు.

తాళ్లపాకకు చెందిన నిరుపేద యేసమ్మ మాట్లాడుతూ తనకు నలుగురు పిల్లలు అని, వారిలో పెద్దకుమారుడు చనిపోయాడని, చనిపోయిన కుమారుడి పిల్లలు పైసలు లేక చదువు మానేశారన్నారు. దీనివల్ల తాను చిట్టెంటుకలు తీసుకుంటూ బతుకుతున్నానన్నారు. ఈ సమయంలో తనకు తోపుడు బండి, పిల్లలకు విద్యాభ్యాసం, ఇల్లు అన్ని రకాల సహాయం చేస్తామని ఉద్దండం సుబ్రహ్మణ్యం ముందుకు రావడం పట్ల తమకు ఆనందంగా ఉందన్నారు.

జిల్లా కేంద్రంపై ఆలోచించి నిర్ణయం

రాజంపేట జిల్లా కేంద్రం విషయం అన్ని ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాజంపేట ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని అందరూ అడుగుతున్నారని, రాష్ట్రమంతా కూటమి ప్రభుత్వం 164 సీట్లు సాధిస్తే రాజంపేటలో పార్టీ అభ్యర్థిని ఓడించడం బాధాకరమన్నారు. గెలిపించిన చోట అన్యాయం చేసి గెలిపించని చోట న్యాయం చేస్తామని చెప్పడం భావ్యం కాదన్నారు. అయినా మా దృష్టిలో రాజకీయాలు వేరు అభివృద్ధి వేరని, ఎన్నికల్లో పార్టీని పరిగణలోకి తీసుకుని ఓటు వేయాలి తప్ప అభ్యర్థిని చూసి ఓటును పరిగణలోకి తీసుకోకూడదన్నారు. ఇదేరోజు 30 ఏళ్ల కిందట తాను సీఎంగా బాధ్యతలు స్వీకరించి ముందుకు సాగుతున్నానని, నేడు ముఖ్యమంత్రిగా తనకు ఇష్టమైన రాజంపేట ప్రాంతంలో ముఖ్యమంత్రిగా పేదల సేవలో ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటూ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ సబ్ కలెక్టర్‌లు భావన, కల్యాణి, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ, తాళ్లపాక గ్రామ నాయకుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఉద్దండం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సీఎం తిలకించారు.

పెన్షన్‌లు పంపిణీ చేసిన సీఎం

- దోబీఘాట్‌లో రజకులతో ముఖాముఖి

రాజంపేట/ రాజంపేట టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం ములక్కాయలపల్లెలో సుమారు 14 సంవత్సరాలుగా మంచంలోనే జీవనం సాగిస్తున్న యడబల్లి సుమిత్రమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.15 వేల వికలాంగ పెన్షన్‌ను స్వయంగా అందజేశారు. ఆమె వద్దకు వెళ్లి ఆమె ఆరోగ్య సమస్యలను, అడిగి తెలుసుకున్నారు. తన భార్య సుమిత్రమ్మ అనారోగ్యంపాలై 14 ఏళ్లుగా మంచానికే పరిమితమై అష్టకష్టాలు పడుతున్నామని సీఎంకు తెలిపారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం బోయనపల్లెలో దోబీఘాట్‌కు చేరుకుని రజకులతో మాట్లాడారు. రజక లబ్ధిదారులైన టి.ఆదిలక్ష్మీ, బి.లక్ష్మీదేవి, టి.లక్ష్మీదేవి, హరిప్రసాద్, జయరాం, నరసింహులు, పెంచలయ్య, సంటెయ్య తదితరులతో మాట్లాడారు. వారి వృత్తిలో కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. వారి అవసరాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వం తరపున రజకులను అన్నివిధాలుగా ఆదుకుంటామని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బోయనపల్లె గ్రామంలో ప్రజలు మంగళ హారతులు పడుతూ నీరాజనాలు పలికారు. పెద్దఎత్తున భవనాల పైకి చేరుకుని మహిళలు, వృద్ధులు సీఎం చంద్రబాబుకు అభివాదం చేశారు.



వికలాంగురాలు సుమిత్రమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన కలెక్టర్ శ్రీధర్



రజకులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



సభలో మాట్లాడుతున్న రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు

సీఎం సభ సక్సెస్

రాజంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సభలు, ఇతర కార్యక్రమాలు సూపర్ సక్సెస్ అయ్యాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నీ తానై స్వాగత తోరణాలు, భారీ ఫ్లెక్సీలు, పసుపు తోరణాలు, జన సమీకరణ, టీడీపీ కార్యకర్తల సమావేశం, సభల నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఇతర ఉన్నతాధికారులు సమిష్టిగా పనిచేసి జిల్లా అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి సభా కార్యక్రమాలను విజయవంతం చేశారు. వికలాంగ పింఛన్లు, రజకులతో సమావేశం, ప్రజా పరిష్కార వేదిక, పెన్షన్ల పంపిణీ కార్యక్రమం, టీడీపీ కార్యకర్తలతో సమావేశం పెద్దఎత్తున నిర్వహించి సీఎ చంద్రబాబు నుంచి ప్రశంసలు అందుకున్నారు.



రాజంపేట పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజును అభినందిస్తున్న సీఎం చంద్రబాబు



సీఎం రాక కోసం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎదురుచూస్తున్న జగన్‌మోహన్‌రాజు

పెన్షన్ సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరార్

- సస్పెండ్ చేసిన అధికారులు

కురబలకోట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెలా ప్రభుత్వం పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ సొమ్ముతో సచివాలయ ఉద్యోగి సోమవారం పరారయ్యాడు. ఎంపీడీవో గంగయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంగళ్లు పంచాయతీ జోగివారిపల్లెకు చెందిన వెంకటరమణ తెట్టు సచివాలయంలో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఇతను తెట్టు పంచాయతీ పరిధిలోని దళితవాడలో 80 మంది లబ్ధిదారులకు రూ.4.90 లక్షల డబ్బును పంచాయతీ అధికారులు బ్యాంకులో డ్రా చేసి శనివారం అతడికి అందజేశారు. అయితే ఆ డబ్బును తీసుకున్న అతను సోమవారం లబ్ధిదారులకు ఇవ్వకుండా పరారయ్యాడు. కాగా సోమవారం అతడి లాగిన్ నుంచి ఒక్క పెన్షన్ కూడా ఇవ్వకపోవడంతో పలువురు లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడి ఫోన్‌కు కాల్ చేయగా స్విచాఫ్ వస్తోంది. దీంతో ట్రాన్స్‌కో ఏఈ శంకర్‌రెడ్డి, ఎంపీడీవో గంగయ్యలు అతడి ఇంటి వద్దకు వెళ్లి విచారించగా రెండు రోజుల నుంచి ఇంటికి రాలేదని వారు తెలిపారు. దీంతో పంచాయతీ కార్యదర్శి రామప్ప ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లబ్ధిదారులకు పెన్షన్లను అందజేయడానికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. కాగా వెంకటరమణ తండ్రి సోమవారం సాయంత్రం రూ.3 లక్షలను ఎంపీడీవో గంగయ్యకు అందచేశారు. మిగిలిన రూ.1.90 లక్షలను మంగళవారం ఇస్తామని చెప్పినట్లు అధికారులు తెలిపారు. కాగా తన కుమారుడికి ఆరోగ్యం బాగా లేదని అందుకే వెళ్లిపోయినట్లు అతడి తండ్రి చెప్పినట్లు తెలిసింది. పెన్షన్ల సొమ్ముతో పరారైన వెంకటరమణను సస్పెండ్ చేస్తూ ట్రాన్స్‌కో డీఈ గంగాధర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.



సచివాలయ ఉద్యోగి వెంకటరమణ

కడప జిల్లాలో మంత్రి నారా లోకేశ్

కడప కలెక్టరేట్ / సీకేదిన్నె, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేశ్ మంత్రి సోమవారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. కడప నగర శివారులోని సీకేదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపంలో భారత్ ఇంజనీరింగ్ కాలేజీలో బస చేశారు. ఈయన మంగళవారం సీకే దిన్నె మండలంలోని జమాల్‌పల్లిలో సెంట్రల్ స్మార్ట్ కిచెన్, పెండ్లిమర్రి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను, కొప్పర్తిలో రెండు పరిశ్రమలను ప్రారంభిస్తారు. అనంతరం బుగ్గలేటిపల్లిలో పార్టీ క్యాడర్ మీటింగ్‌లో మంత్రి లోకేశ్ పాల్గొంటారు. సాయంత్రం 5-30 గంటలకు బుగ్గలేటిపల్లి నుంచి బయలుదేరి కడప విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి విమానంలో గన్నవరం వెళతారు. చింతకొమ్మదిన్నె మండలంలో మంత్రి నారా లోకేశ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే చైతన్యరెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. మరోవైపు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులకు తగు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు భూపేశ్‌రెడ్డి, తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టులో మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

సీఎస్ డీటీ ఆస్తుల జప్తునకు శ్రీకారం

6

- వివరాలు పంపాలని జేసీ ఆదేశం
- ఆర్ఆర్ యాక్టు అమలుకు చర్యలు

టపాకాయ చేతిలో పేలి

బాలుడికి తీవ్ర గాయాలు

- మణికట్టు వరకు చేతిని కోల్పోయిన వైనం





చేతికి తీవ్ర గాయమైన దృశ్యం - రంజిత్ (ఫైల్)

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగంపేట గ్రామ పంచాయతీలోని కొత్తమంగంపేటలో ఆదివారం వినాయక నిమజ్జనం సందర్భంగా టపాకాయ చేతిలో పేలి చేయి కోల్పోయిన విదారకమైన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కొత్త మంగంపేటలోని రెండో వీధిలో వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా వేపన రంజిత్ (12) టపాకాయలు పేలుస్తుండగా పొరపాటున చేతిలోనే పేలింది. దీంతో ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మణికట్టు వరకు తీసివేశారు. బాలుడి తండ్రి వేపన చిన్నప్ప మూడు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయాడు. బాలుడు ఆపరేషన్‌కు చికిత్స ఖర్చులు సుమారు రూ.2.50 లక్షలు అవుతుందని, తమ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని మానవతా హృదయంతో దాతలు ఆదుకోవాలని బాలుడి తల్లి వేడుకొంటున్నారు.

రోప్ స్కిప్పింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ



రన్నర్స్‌గా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా డోన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌షిప్ రన్నర్స్‌గా నిలిచారు. సోమవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ డోన్‌లో నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి పలు జిల్లాల జట్లు పాల్గొన్నాయన్నారు. ఇందులో అన్నమయ్య జిల్లా జట్టు నుంచి పాల్గొన్న మదనపల్లె విద్యార్థులు ఉమెన్స్ డబుల్ టచ్ టీమ్ రిలేలో విజయం సాధించగా, మెన్స్ డబుల్ అండర్ టీమ్ రిలేలో విజేతలుగా నిలిచారన్నారు. దీంతో పాటు స్పీడ్‌స్ప్రింట్ మెన్, ఉమెన్ విభాగంలో ఏడు బంగారు పతకాలు, 4 రజత పతకాలు సాధించారన్నారు. అనంతరం రాష్ట్ర జట్టుకు నిర్వహించిన ఎంపికలో మదనపల్లెకు చెందిన ఒక బాలుడు, ఏడుగురు బాలికలు ఎంపికయ్యారని, వీరు వచ్చే నెల ముంబైలో నిర్వహించే జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్ అభినందించారు.

రైతు బలమే దేశం బలం : షఫీ

● నాయనబావి వద్ద సినీ నటుడి పర్యటన



నాయనబావి వద్ద స్థానికులతో సినీ నటుడు షఫీ

బి.కొత్తకోట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతు బలంగా, క్షేమంగా ఉన్నప్పుడే దేశం కూడా బలంగా ఉంటుందని సినీనటుడు షఫీ అభిప్రాయపడ్డారు. ఖడ్గం, ఛత్రపతి లాంటి పలు సినిమాలలో నటించిన సినీనటుడు షఫీ సోమవారం బి.కొత్తకోట మండల పరిధిలోని నాయనబావి గ్రామంలో పర్యటించారు. చంద్రగిరికి చెందిన షఫీ గతంలో పలుమార్లు హార్సిలీహిల్స్, బి.కొత్తకోటలో పర్యటించారు. అదే క్రమంలో హార్సిలీహిల్స్ దిగువభాగంలో వున్న నాయనబావి గ్రామంలో కొంతభూమిని కొనుగోలు చేసిన వ్యవసాయ క్షేత్రంలో ఆయన కుటుంబంతో పాటు ఆత్మీయులతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులను అన్ని విధాలా ఆదుకొని వ్యవసాయరంగానికి చేయూతనివ్వాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియన వ్యక్తి సోమవారం పట్టణంలోని కోమటివాని చెరువు సమీపంలో మృతి చెందినట్టు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణం నడిబొడ్డున్న ఉన్న కోమటివాని చెరువు సమీపంలో 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది పడిఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే టూటౌన్ పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీంచి చిత్తుకాగితాలు ఏరుకునే వ్యక్తిగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు గడ్డం పెంచుకుని, ఖాకీ చొక్కా వేసుకుని ఉన్నాడని, మృతిని సమాచారం తెలిసిన వారు 9491074519, 9440796741నంబర్లకు తెలపాలని సీఐ కోరారు.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన చంద్రకళ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని సోమవారం ఉదయం మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణం నక్కల దిన్నె తాండాలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం నక్కలదిన్నె తాండా చుక్కల తాండాకు చెందిన చంద్రకళ (27) తన భర్త చంద్రశేఖర్ నాయక్ రేషన్ బియ్యం కోసం వెళ్లగా ఇంట్లో ఎవ్వరూ లేని సమయం చూసుకుని ఉరి వేసుకుంది. అనంతరం వచ్చిన భర్త స్థానికులతో కలిసి చంద్రకళను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

లారీ ఢీకొని స్కూటరిస్టు మృతి



మృతి చెందిన శ్రీనివాసులు ఫైల్‌ఫొటో

పుల్లంపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట సమీపంలో సోమవారం లారీ ఢీకొని పుత్తనవారిపల్లె గ్రామానికి చెందిన ఉమ్మడి శ్రీనివాసులు(44) అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పయ్యరాజుపేట వద్ద పెట్రోల్ బంకులో పనిచేస్తున్న శ్రీనివాసులు విధులకు వెళుతుండగా తిరుపతి వైపు నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసులు మరణవార్త విని పుత్తనవారిపల్లె గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ సంఘటనపై ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు స్కూటర్లు ఢీ

● ఇరువురికి గాయాలు

అట్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లె వద్ద సోమవారం సాయంత్రం రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఎస్.వెంకటాపురంలోని ఉప్పటూరు కాలనీకి చెందిన శ్రీబాబుకు తీవ్ర రక్తగాయాలు కాగా గోపినాధపురరానికి చెందిన నరసింహారెడ్డికి స్వల్పగాయాలైనట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఇరువురినీ 108 వాహనంలో కడప రిమ్స్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే ఇరువురూ మూగవారు కావడం గమనార్హం. శ్రీబాబు బద్వేలు రూటు నుంచి సిద్దవటం వైపు వెళుతుండగా, సిద్దవటం వైపు నుంచి గడ్డిమోపు బండిపై పెట్టుకుని నరసింహారెడ్డి ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. నుజ్జునుజ్జు అయిన స్కూటర్లను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీ కోసం కష్టపడని వారిని

నిర్మోహమాటంగా తొలగిస్తాం

● వచ్చే ఎన్నికల్లో రాజంపేటలో భారీ మెజార్టీతో గెలుస్తాం ● రాష్ట్రంలో 175కు 175 స్థానాలు గెలుస్తాం
● పులివెందులను సైతం గెలిపించుకుంటాం ● కార్యకర్తల సమావేశంలో చంద్రబాబునాయుడు





కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. హాజరైన రాజంపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

రాజంపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సొంత పనులు చూసుకుంటూ పార్టీ అభ్యున్నతికి పాటుపడని ఏ నాయకుడినైనా నిర్మోహమాటంగా మార్చివేస్తామని, క్లస్టర్ ఇన్‌చార్జి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి వరకు ఏ స్థాయిలో ఉన్న నాయకుడికైనా ఇది వర్తిస్తుందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబునాయుడు హెచ్చరించారు. సోమవారం రాజంపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందరూ కలిసికట్టుగా బాధ్యత తీసుకుని నియోజకవర్గంలో బలమైన నాయకత్వాన్ని నెలబెట్టుకోవాల్సిన బాధ్యత మీదేనన్నారు. బలమైన నాయకత్వాన్ని మీరు నిలబెట్టుకుని పార్టీని బలపరచి గెలిపించుకుంటే మీ అందరినీ అన్నివిధాల గౌరవించే బాధ్యత తీసుకుంటానన్నారు. పులివెందులతో పాటు ఒంటిమిట్టలో మీ సత్తా చాటి జడ్పీటీసీలను గెలిపించుకున్నారని, అదే స్ఫూర్తితో ముందుకుపోవాలన్నారు. ఎన్డీయే కూటమి ఓడిపోయే పరిస్థితి ఉండదని, సూపర్‌సిక్స్ పథకం సూపర్ హిట్ అయిందని, సంక్షేమం, అభివృద్ధిలో మనకు ఎవరూ సాటి రారన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ నుంచి గ్రామ, మండల, నియోజకవర్గ నాయకులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తీరుస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రతినెలా పంపిణీ చేసే పెన్షన్ల కార్యక్రమంలో గ్రామ నాయకులు విధిగా పాల్గొంటూ వారికి సాధక బాధకాలు తెలుసుకుని పరిష్కరిస్తే మీ నాయకత్వానికి తిరుగు ఉండదన్నారు. అలా కాకుండా సొంత పనులు చూసుకుంటూ పార్టీని గాలికి వదిలేస్తే వారిపై ఎప్పటికప్పుడు విచారణ చేసి వారు సక్రమంగా పనిచేయకపోతే మార్చివేయడం తథ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు, మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఆస్పత్రులపై చర్యలు : డీఎంహెచ్‌వో

● సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీలు



ఐయూఐ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

రాయచోటిటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 11 ఐయూఐ కేంద్రాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, అనుమతులు లేని ఆస్పత్రులపై శాఖాపరమైన చర్యలు తీసుకుం టామని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య తెలిపారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని సంతాన సాఫల్య కేంద్రాలలో సోమవారం ఆయన ఆకస్మిక తని ఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ తల్లి కావాలనుకున్న సంతానం లేని దంపతులకు సహాయ పడాల్సిన కొన్ని ఆసు పత్రులు మోసపూరిత కేంద్రాలుగా మారుతు న్నాయన్నారు. ఈ మధ్య వార్తల్లోకి వచ్చిన హైదరాబాద్, వైజాగ్, గుంటూరు, విజయ వాడ వంటి పెద్ద నగరాలకు పరిమితమైన ఐవీఎఫ్ కేంద్రాలు ప్రస్తుతం జిల్లా స్థాయికి విస్తరిస్తున్నాయన్నారు. జిల్లా కేంద్రంలో 11 ఐయూఐ ఆసుపత్రులకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ అనుమతులు లేని ఆసుపత్రులు గైనకాలజిస్టుల ఆధ్వర్యంలో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ పిల్లలు లేని దంపతులకు ఆశలు కల్పిస్తూ ఉచిత కన్సల్టెన్సీ, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇటీవల సికింద్రాబాద్‌లో సృష్టి హాస్పిటల్‌లో జరిగిన సంఘటన రెండు తెలుగు రాష్ట్రాలలో కలకలం రేపడంతో ప్రభుత్వం స్పదించి జిల్లా వ్యాప్తంగా సంతాన సాఫల్య కేంద్రాలను, అనుమతులు లేకుండా ఉన్న ఆసుపత్రులను తనిఖీలు నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని 11 ఐయూఐ కేంద్రాలను తనిఖీలు నిర్వహించామని తెలిపారు.

గండికోట నుంచి 7,500 క్యూసెక్కులు విడుదల



కొండాపురం/మైలవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి సోమవారం సాయింత్రం నుంచి 7,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు ఈఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 10,700 క్యూసెక్కులు, వరదనీరు మరో 600 క్యూసెక్కులు వచ్చి చేరినట్లు తెలిపారు. కాగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.15 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటివిడుదల జరుగుతుందని జలాశయ ఈఈ రమేష్ సోమవారం తెలిపారు. జలాశయం నుంచి పెన్నానదికి 10 వేల క్యూసెక్కులు, ఉత్తర, దక్షిణ కాలువలకు 200 క్యూసెక్కుల మేర నీటి విడుదల కొనసాగుతోంది. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయంలో అయిదు వేల క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోంది.

గోడ కూలి విద్యార్థికి గాయాలు



గాయపడిన విద్యార్థి భరత్

తంబళ్లపల్లె, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని మరుగుదొడ్డి గోడ కూలి పదో తరగతి విద్యార్థి గాయపడిన సంఘటన సోమవారం తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. ఆ వివరాల్లోకి వెళితే.. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న భరత్ సోమవారం మధ్యాహ్నం ఇంటర్వెల్ సమయంలో పాఠశాలలో ఉన్న పాత బాత్‌రూమ్‌కు వెళ్లాడు. ఆ సమయంలో గతంలో పగుళ్లు ఏర్పడి దెబ్బతిని ఉన్న గోడ అకస్మాత్తుగా కూలి భరత్ కుడి కాలిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలపడంతో హెచ్ఎం దామోదర్‌రెడ్డి వెంటనే విద్యార్థిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించి వైద్య చికిత్సలందించారు. మోకాలి పైభాగంలో ఎముక విరగడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి బర్డ్ ఆసుపత్రికి తరలించారు. కాగా, పాఠశాలలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ఉపాధ్యాయులు వినియోగించే క్రమంలో విద్యార్థులకు అనుమతి లేకపోవడం వల్లనే శిథిలావస్థలో ఉన్న పాత మరుగుదొడ్లను విద్యార్థులు వినియోగిస్తున్నారని, ఈ క్రమంలోనే గోడ కూలి భరత్ తీవ్రంగా గాయపడ్డాడని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రేమను నిరాకరించిందని..

యువకుడి ఆత్మహత్య

● మృతుడు ఉత్తరప్రదేశ్ వాసిగా గుర్తింపు



మృతి చెందిన అర్జున్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రియురాలు తన ప్రేమను నిరాకరించిందని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు ఆదివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రైల్వేకోడూరులో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ (24) మెకానిక్‌గా తిరుపతిలోని ఒక షోరూంలో పని చేసి ఆరు నెలల కిందట రైల్వేకోడూరుకు వచ్చి హీరో షోరూంలో పని చేస్తున్నాడు. రైల్వేకోడూరు ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు పక్కనే నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా ఉత్తరప్రదేశ్‌లోని ఒక అమ్మాయి ప్రేమలో పడ్డాడు. ఆదివారం రాత్రి ప్రేమించిన అమ్మాయితో ఫోన్‌లో మాట్లాడాడు. తన ప్రేమను నిరాకరించడంతో నివాసముంటున్న ఆ ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అమ్మాయికి చేసిన ఫోన్ నెంబర్లు, అర్జున్ తల్లిదండ్రులు, బంధువుల ఫోన్ నెంబర్లు సేకరించి జరిగిన సంఘటనపై సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

● తృటిలో తప్పిన ప్రమాదం

రైల్వేకోడూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ ప్రధానదారిలో ఓ కారు సోమవారం అదుపు తప్పడంతో ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. కారు డ్రైవింగ్ చేస్తున్న సుబ్రహ్మణ్యంరెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడని స్థానికులు తెలిపారు. గాయపడిన వ్యక్తి స్వగ్రామం మంగంపేట కాపుపల్లెగా గుర్తించారు. ప్రమాదం తృటిలో తప్పింది. ఈ మేరకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

భాకరాపేట సమీపంలో...



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

సిద్దవటం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలోని భాకరాపేట సమీపంలో పెనుప్రమాదం తప్పింది. సోమవారం కడప నగరానికి చెందిన రమణ తన కుటుంబ సభ్యులతో కలిసి రేణిగుంటకు కారులో బయలుదేరాడు. సిద్దవటం మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి భాకరాపేట సమీపాన రోడ్డుపైకి ఆవు అడ్డురావడంతో కారు అదుపు తప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయంపై ఎస్ఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరగా జరిగిన ఘటన స్థలానికి వెళ్లి చూశామని, ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. వాహనదారులు జాతీయ రహదారిపై నెమ్మదిగా వెళ్లాలని, అతివేగం ప్రమాదకరమని సూచించారు.

రెండు డీఏలను వెంటనే ప్రకటించాలి

● నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస రాజు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు బకాయిలు ఉన్న నాలుగు కరువు భత్యాల్లో కనీసం రెండింటిని వెంటనే విడుదల చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస రాజు అన్నారు. సోమవారం పట్టణంలోని నోబుల్‌టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి వెంటనే ఓపీఎస్‌ను ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ అసోసియేషన్ నాయకులు రవిశంకర్, ప్రభాకర్, రవి, రమణ, ఆనంద్, సుబ్బరాజ, మల్లికార్జున, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె సీఎస్ డీటీ..

ఆస్తుల జప్తునకు శ్రీకారం

● వివరాలు పంపాలని జేసీ ఆదేశం
● ఆర్‌ఆర్ యాక్టు అమలుకు చర్యలు





తంబళ్లపల్లెలోని అప్పటి సివిల్ సప్లయ్ గోదాము

మదనపల్లె, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె పౌరసరఫరాల శాఖ గోదాము డీటీ పి.హరిప్రసాద్ ఆస్తుల జప్తునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌ఛైర్మన్ విజయవాడ, ఆదేశాల మేరకు రెవెన్యూ రికవరీ యాక్టు(ఆర్‌ఆర్)లో భాగంగా జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పేరున, ఆయన కుటుంబ సభ్యుల పేరున ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలు వెంటనే పంపాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, మదనపల్లె తహసీల్దార్లను ఆదేశించారు. ఇందులో రెవెన్యూ రికార్డులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రికార్డుల మేరకు ఆస్తులు గుర్తించాలని సూచించారు. హరిప్రసాద్ తంబళ్లపల్లెలో 2022లో డీటీగా, గోదాము ఇన్‌చార్జిగా పని చేశారు. అప్పట్లో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారని ఆ శాఖ అధికారులు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.9.22కోట్లు ఉంటుందని లెక్క గట్టి డీటీకి నోటీసులు జారీ చేశారు. అనంతరం డీటీ సస్పెండ్ కావడంతో పాటు తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. సస్పెన్షన్‌లో ఉన్న డీటీకి తర్వాత పెండింగ్ ఎంక్వయిరీ కింద తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన రాయచోటి ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పని చేస్తున్నారు.

ఏం జరిగిందంటే..!

తంబళ్లపల్లె పౌరసరఫరాల గోదాము కేంద్రంగా రేషన్ బియ్యంలో భారీ స్కామ్ చోటుచేసుకుంది. 995 టన్నుల రేషన్ బియ్యం, కార్డుదారులకు అందజేసే కందిపప్పు, చక్కెర మాయమయ్యాయి. రూ.కోట్ల స్కామ్‌లో అప్పటి సీఎస్ డీటీ హరిప్రసాద్, గోదాములో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ సదాశివగా గుర్తించారు. దీనిపై సీఎస్ డీటీని సస్పెండ్ చేయగా, కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుండి శాశ్వతంగా తొలగించారు. ఇరువురిపైనా కేసులు నమోదు చేశారు. ఇక్కడి గోదాము నుంచి తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం మండలాల్లోని రేషన్ షాపులకు సరుకులు సరఫరా చేస్తున్నారు. స్టేజీ-1(రేణిగుంట) నుంచి స్టేజీ-2కు (గోదాము) వచ్చిన 995 టన్నుల బియ్యం, 20టన్నుల కందిపప్పు, రెండుటన్నుల చెక్కర గోల్‌మాల్ కాగా ప్రభుత్వ లెక్కల ప్రకారం వీటి విలువ రూ.4కోట్లు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

కలిసొచ్చిన ఉచిత బియ్యం

కరోనా ప్రభావం, లాక్‌డౌన్ నేపథ్యంలో పేద ప్రజలను ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం గరీబ్ కళ్యాణ్‌అన్నయోజన(పీఎంజీకేవై) పథకంలో పేదలకు ఒక్కొక్కరికి అయిదు కేజీల చొప్పున 2020 ఏప్రిల్ నుంచి ఉచిత బియ్యం పంపిణీ చేసింది. ఇందులో భాగంగా ప్రతినెలా రెగ్యులర్ పీడీఎస్‌తో పాటు కేంద్రం ఉచితబియ్యం అదనంగా ఇచ్చింది. ఇందులోభాగంగా స్టేజీ-1(ఎంఎల్ఎస్ కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే కేంద్రం) రేణిగుంట, ఏర్పేడు, నెల్లూరు, తదితర ప్రాంతాల నుంచి తంబళ్లపల్లె గోదాము(స్టేజీ-2) లారీలతో లోడ్‌లకు లోడ్లు దింపేశారు. ఒకేనెలలో రెండు కోటాలకు కార్డుదారులకు సరుకులు ఇవ్వాల్సి రావడంతో బియ్యాన్ని డంప్ చేశారు. ఈ క్రమంలోనే అక్రమాలకు ఆస్కారం ఏర్పడింది. స్థానికంగా వచ్చిన స్టాకు దింపుకునేందుకు స్థలం లేకపోవడంతో ముందస్తుగా చౌకదుకాణాలకు కొన్ని, మరికొన్ని బస్తాలు దారి మళ్లించారు.

భారీ స్కామ్ బయటపడిందిలా..

స్టేజీ-1 నుంచి తంబళ్లపల్లె(స్టేజీ-2)కు సరఫరా చేసిన బియ్యానికి, గోదాము నుంచి వచ్చిన లెక్కలకు ఏమాత్రం పొంతన కుదరలేదు. రీకన్సలేషన్‌లో ప్రతినెలా అడ్వాన్సుగా తోలామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో చౌకదుకాణాల్లో స్టాకూ లేదు. ఉచిత బియ్యం సరఫరా కూడా ఆగిపోవడంతో అమ్మేసిన బియ్యం లోటును పూడ్చలేకపోయారు. అలాగే కందిపప్పు, చక్కెర సరఫరా కూడా ఆగిపోయింది. తర్వాత లోటు బియ్యాన్ని ఎక్కడైనా కొని తెద్దామంటే స్టాకూ లేదు. మరోవైపు విజిలెన్స్, పోలీసు నిఘా విస్తృతంగా ఉంది. తీరా అధికారులు తనిఖీ చేస్తే గోదామూ ఖాళీగా వుంది. స్టేజీ వన్ నుంచి స్టేజీ-2కి రావాల్సిన బియ్యం అక్కడి నుంచి అట్లే దారి మళ్లినట్లు గుర్తించారు. సాంకేతికత, వాహనం ట్రాకింగ్, తదితర అంశాల ఆధారంగా స్కామ్‌ను బయటపెట్టారు. ఈ బియ్యం స్కామ్ తేల్చడానికి అప్పటి కలెక్టర్ పి.ఎస్.గిరీష ముగ్గురు సభ్యులతో కూడిన బృందాన్ని నియమించారు. ఇందులో సభ్యులైన సివిల్‌సప్లయ్ డీఎం శ్రీనివాస్, డీఎస్‌వో రఘురాం, ఆర్డీవో ఎం.ఎస్.మురళి విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అలాగే డీఎం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నామినేటెడ్ పోస్టులు ఎప్పుడు?

- అధికారం వచ్చి ఏడాది దాటినా భర్తీ కాని వైనం
- వలస బ్యాచ్‌లకే పార్టీలో ప్రాధాన్యం
- ఎమ్మెల్యేలకు, కేడరుకు మధ్య పెరిగిన అగాధం
- రగులుతున్న పసుపుసైన్యం

యువనేత, మంత్రి నారా లోకేశ్ టీడీపీకి భవిష్యత్తు ఆశాకిరణం. కార్యకర్తల కోసం ఎంతకైనా తెగిస్తారని ఆయనకు పేరుంది. అందుకే తక్కువ కాలంలోనే కేడరు లోకేశ్‌ను సొంతం చేసుకుంది. తమ భవిష్యత్ నేతగా ఆయనకు బ్రహ్మారథం పడుతున్నారు. అలాంటి నేత మంగళవారం జిల్లాలో పర్యటిస్తున్నారు. మంత్రి హోదాలో పరిశ్రమలు, కళాశాల, స్మార్ట్ కిచెన్ సెంటర్లను ప్రారంభించనున్నారు.. కేడరు మాత్రం ఈ పర్యటనపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నవారు తమకు లోకేశ్ భరోసా ఇస్తారని ఆశిస్తున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ సొంత జిల్లాలో టీడీపీకి కరుడుగట్టిన పసుపు సైన్యం ఉంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కూటమికి ఏడు అసెంబ్లీ సీట్లు కట్టబెట్టారు. తరువాత జరిగిన మహానాడు సూపర్ సక్సెస్ అయింది. ఇటీవల పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో జగన్‌కు మైండ్ బ్లాక్ చేసేలా టీడీపీకి పట్టం గట్టారు. టీడీపీపై, ఇటు పార్టీపై అభిమానం చూపుతున్నారు. అయితే అదే స్థాయిలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో జిల్లాలోని కరుడుగట్టిన ఫ్యాన్స్‌కు న్యాయం చేయకపోవడంతో కేడరు నిస్తేజంగా ఉంది.



మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత, పుత్తా చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, వరదరాజులరెడ్డి, మాధవిరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, భూపేశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయమ్మ, సురేశ్‌నాయుడు తదితరులు

పదవుల కోసం వెయిటింగ్

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. అయితే కొన్ని చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు /ఇన్‌చార్జిలు కేడరు మధ్య భారీ గ్యాప్ వచ్చింది. తొలి ఆరు నెలల వరకు బాగున్నా తరువాత ఒక్కసారిగా కేడరులో అసంతృప్తి రగులుకుంది. కొందరు ఎమ్మెల్యేల తీరు మరీ అధ్వాన్నంగా ఉంది. టీడీపీ కేడరు కష్టపడితే గెలిచామన్న విషయాన్ని వదిలేసి తమ స్వశక్తితోనే గెలిచామనే స్థాయికి వచ్చేశారు. కేడరును పూర్తిగా వదిలేశారు. ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడంతా టీడీపీలో ఇలాంటివారిదే పెత్తనం. దీంతో ముఖ్యంగా బలిజ, బీసీ, ఎస్టీ కులాల్లో అసంతృప్తి ఉంది. వారిని పట్టించుకోవడం వదిలేసి ఒక సామాజికవర్గాన్నే నెత్తిన పెట్టుకుంటున్నారని అంటున్నారు. ఈ వ్యవహారాన్ని పట్టించుకోకపోతే ఆ ప్రభావం రాబోవు రోజుల్లో కనిపిస్తుందని టీడీపీ అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

సమన్వయం ఏదీ?

సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఏడు సీట్లు కట్టబెట్టారు. ఏడాది పాలనపై జనంలో మంచి అభిప్రాయం ఉంది. అయితే ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి గ్రౌండ్ స్థాయిలోకి వెళ్లడంలేదు. పసుపుజెండా కనిపిస్తే చెవి కోసుకునే కేడరును అంతా ఇప్పుడు నేతలు పట్టించుకోవడంలేదు. వారిని నిర్వీర్యం చేశారు. దీంతో పాటు జిల్లాలో టీడీపీ నాయకుల మధ్య సమన్వయం, సఖ్యత లేదు. టీడీపీలో ఉన్నత పదవులు పొందిన మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్‌ను లక్ష్యంగా ఘోరంగా విమర్శలు చేస్తున్నారు. ఆ విమర్శలను జిల్లాలో టీడీపీ నేతలు తిప్పికొట్టలేక పోతున్నారు. బీటెక్ రవి మాత్రమే కౌంటరు ఇస్తుండగా మిగతా నేతలంతా చేతులెత్తేశారు. ఇక సూపర్‌సిక్స్ ఇతర పథకాల అభివృద్ధిపై వైసీపీ నేతలు అటు నేరుగా మీడియా, సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నప్పటికీ ధీటుగా బదులివ్వకపోవడం గమనార్హం. మహానాడు మినహాయిస్తే టీడీపీలో ఒక్క ప్రోగ్రాం కూడా వేదికపై లేదు. తెలుగుగంగ ప్రాజెక్టు, సాగునీరు, చేనేతలకు ఉచిత విద్యుత్.. ఇలా ఎన్నో కార్యక్రమాలు ఉన్నప్పటికీ కూడా ఒక్క కార్యక్రమం చేసి జగన్ బ్యాచ్‌కు ధీటుగా ఇప్పటి వరకు సమాధానం చెప్పలేదు.

కడప జిల్లాలో కేవలం సిక్స్ అవర్స్ పాలిటిక్స్ చేస్తారనే చర్చ ఆ వర్గాల్లో ఉంది. పగలు టీడీపీతో రాత్రి వైసీపీ బ్యాచ్‌తో ఉంటారనే ప్రచారం ఉంది. జగన్ హయాంలో మంత్రి నారా లోకేశ్‌ను ఓ యూట్యూబ్ స్టార్ ఘోరంగా విమర్శించారు. ఆ స్టార్‌తో ఓ నేత డీల్ చేసుకున్నారన్న చర్చ ఉంది. వచ్చే ఎన్నికలకు జిల్లాలో పార్టీ బలోపేతం చేయాలంటే ముఖ్యంగా రాజకీయంగా అందరినీ ఏకతాటిపైకి తెచ్చుకోవాలి. జగన్ చేయని అభివృద్ధిని చేసి చూపించాలి. పులివెందులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. పార్టీలోని చీడ పురుగులను, వైసీపీతో రాత్రిపూట అంటకాగే బ్యాచ్‌ను తీవ్రంగా మందలించాలి. లేదా పార్టీ కార్యక్రమాలకు అలాంటి వారిని దూరం పెట్టాలి. టీడీపీ వీరాభిమానులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి...తీవ్రగాయాలు

పులివెందుల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలతో కృష్ణయ్య యాదవ్ అనే వ్యక్తిపై ఇరువురు కట్టెలతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు లింగాల మండలం బోనాలకు చెందిన కృష్ణయ్య యాదవ్ సింహాద్రిపురం మండలం అంకాళమ్మగూడూరుకు చెందిన నాగరాజుయాదవ్‌కు గతంలో ఓ ఇళ్లు అమ్మారు. ఇందుకు సంబంధించి డబ్బులు చెల్లించలేదని కృష్ణయ్యయాదవ్ బొలెరో వాహనంతో నాగరాజుయాదవ్ తన పొలంలో ఉన్న సమయంలో ఢీకొట్టారు. అప్పట్లో సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. సింహాద్రిపురం మండలంలో కేసు నమోదు కావడంతో కృష్ణయ్య యాదవ్ కొడుకు రైల్వేకోడూరులో కాపురం ఉంటున్నాడు. అతని వద్దకెళ్లి కృష్ణయ్యయాదవ్ ఉంటున్నారు. పింఛన్ కోసం సోమవారం కృష్ణయ్యయాదవ్ వస్తున్న సంగతి నాగరాజుయాదవ్ తెలుసుకొని పథకం ప్రకారం మరో ఇరువురితో కలిసి పులివెందులలోని పూలంగళ్ల సమీపంలోని పాతమార్కెట్ వద్ద కట్టెలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కృష్ణయ్యయాదవ్‌ను చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించగా.. డీఎస్పీ మురళీనాయక్, రూరల్ సీఐ రమణలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణునారాయణ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ..ఇద్దరికి గాయాలు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని అక్కంపేట గ్రామ ఎస్సీ కాలనీలో ఇంటిస్థలం విషయమై గొడవకు పాల్పడటంతో ఇద్దరికి గాయలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు పాణ్యం నాగేంద్ర, రామచంద్ర ఇంటిస్థలం విషయమై తరచూ గొడవలు పడేవారు. ఈ నేపథ్యంలో నాగేంద్ర కొప్పర్తి పారిశ్రామికవాడలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. సోమవారం ఉదయం యదావిధిగా పనికి వెళుతుండగా రామచంద్ర అతనితో గొడవపడ్డాడు. దీంతో ఇరువురు కట్టెలతో దాడి చేసుకోవడంతో ఇద్దరికి రక్తగాయాలయ్యాయి. సమాచారం పోలీసులకు తెలియడంతో ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బాకీ విషయమై ఘర్షణ... వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

దువ్వూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యో): బాకీ విషయమై జరిగిన ఘర్షణలో జేష్టాది దివాకర్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వినోద్‌కుమార్ వివరాల మేరకు.. మండలంలోని బీమునిపాడు గ్రామంలో దళితవర్గానికి చెందిన దివాకర్‌కు నాగదస్తగిరి బాకీ ఉండడంతో చెల్లించమని అడిగాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య మాటకు మాట పెరగడంతో దస్తగిరి దాడి చేసి దివాకర్ తలపై రాయితో కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో దివాకర్‌ను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తల్లి మరియమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని శవాన్ని డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పరిశీలించారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్లకుంట సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో విద్యుత్‌షాక్‌కు గురై చిన్న గురయ్య (50) అనే కౌలు రైతు మృతి చెందాడు. ఎరసాల దళితవాడకు చెందిన చిన్న గురయ్య ఈర్లకుంట సమీపంలో పొలాలను కౌలుకు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం పొలంలో నీరు కట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు ఆరా తీస్తున్నారు.

పోలీసు విధులకు ఆటంకం.. ఐదుగురిపై కేసు

కడప క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం కొండాయపల్లెలో వినాయక ఉత్సవం సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులను అడ్డుకున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. కొండాయపల్లెలో వినాయక నిమజ్జనం కోసం ర్యాలీగా వెళుతున్న సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై మల్లేశ్వర్‌రెడ్డి మరో నలుగురు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు. దీంతో ఐదుగురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

హోంగార్డు అత్యుత్సాహం

డీజే ఉన్న వాహనం నడపడంతో బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

కడప క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడపనగరం ఓం శాంతినగర్‌లోని వినాయకుని నిమజ్జనం చేసేందుకు వాహనాలతో డీజే వాహనంతో కలిపి ర్యాలీగా వెళుతున్నారు. ఎన్జీవోకాలనీకి రాగానే అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు డీజే ఉన్న ఐచర్ వాహనాన్ని స్పీడ్‌గా నడపమంటూ డ్రైవర్‌కు సూచించాడు. దీంతో డ్రైవరు మీరు చూడండి అంటూ సమాధానం ఇవ్వడంతో ఆ హోంగార్డు డ్రైవరును కిందికి దించి ఐచర్ వాహనాన్ని నడిపాడు. ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని రిమ్స్‌కు తరలించారు. దీంతో కాసేపు విగ్రహ కమిటీ సభ్యులు హోంగార్డు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పెద్దలు సర్ది చెప్పడంతో నిమజ్జనానికి వాహనాలు అక్కడ నుంచి వెళ్లిపోయాయి.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్- 23 మెన్స్ మల్టీడే (మూడురోజుల) ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలలో భాగంగా వివిధ జట్ల మధ్య గత మూడురోజులుగా సాగుతున్న మ్యాచ్‌లు సోమవారం డ్రాగా ముగిశాయి. వివారాలిలా..... కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప- చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో ఆదివారం ఆటకు చివరి రోజు కడప జట్టు 117.4 ఓవర్లలో 406 పరుగులు చేసింది. ఇందులో నాగచైతన్య 174 పరుగులు చేయగా ఆదిల్ హుస్సేన్ 66 పరుగులు చేశారు. అంతకు ముందు టాస్‌నెగ్గిన కడప జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. రెండవ రోజు తిరిగి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొత్తం 137.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయిన తర్వాత 589 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 32.4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 99 పరుగులు చేసింది. ఆటకు చివరిరోజున తిరిగి 99 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్‌కు దిగి మొత్తం 117.4 ఓవర్లలో 406 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో చిత్తూరు జట్టుకు 183 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించగా మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 82 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 374 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి రెండవ రోజు బ్యాటింగ్‌కు దిగి మొత్తం 96.4 ఓవర్లలో 514 పరుగులకు ఆలౌట్ అయింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మొదటి ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు కేవలం 41.5 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టుకు 382 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 54 పరుగులు చేసింది. చివరిరోజు 54 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి బ్యాటింగ్‌కు దిగి 34.2 ఓవర్లలో 138 పరుగులు సాధించి డిక్లేర్ చేసింది. దీంతో రెండు ఇన్నింగ్స్‌లో 520 పరుగుల ఆధిక్యతో పటిష్ట స్థితికి చేరింది. ఇందులో పవన్‌రిత్విక్ 51 పరుగులు సాధించారు. అనంతరం సెకెండ్ ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 63 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. ఇందులో నయీముల్లా 81 పరుగులు, సాయి సూర్య తేజారెడ్డి 62 పరుగులు చేశారు. దీంతో నిర్వాహకులు మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.



నాగచైతన్య (కడప), నయీముల్లా (కర్నూలు)

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఇన్‌చార్జ్ అధికారిగా కరీముల్లా షరీఫ్



విజిలెన్స్ అధికారికి స్వాగతం పలుకుతున్న సీఐలు నారాయణప్ప, శివన్న

కడప క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఇన్‌చార్జ్ అధికారిగా కరీముల్లా షరీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం తిరుపతి విజిలెన్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా విజిలెన్స్ అధికారిగా శ్రీనివాసరావు ఇటీవల పదవీ విరమణ పొందడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో తిరుపతి విజిలెన్స్ అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించడంతో ఆ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

జర్మన్ నర్సింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జర్మన్ నర్సింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని బైరాగిపట్టెడిలో ఉన్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్‌హాస్టల్‌లో ఉచితంగా శిక్షణ ఉంటుందన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 20 నుంచి 35 ఏళ్ల లోపు వారు, నర్సింగ్ డిగ్రీ కలిగి ఉండాలన్నారు. జీఎన్ఎం నర్సింగ్ చేసిన అభ్యర్థులు ఒక సంవత్సరం, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు ఆరు నెలలు అనుభవం కలిగి ఉండాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.2.40 లక్షలు నుంచి రూ.3.10 లక్షలు వేతనం ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి 8 నుంచి 10 నెలలు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను కొత్త కలెక్టరేట్ కార్యాలయంలోని డి బ్లాక్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సెప్టెంబరు 4లోపు సమర్పించాలని ఆమె కోరారు.

భారీ వాహనాల డ్రైవింగ్‌కు..

ఎస్సీకార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్త్రీలకు భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఎల్ఎంవీ లైసెన్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించి 20 నుంచి 40 సంవత్సరాల్లోపు వయసు ఉన్న వారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 4లోపు కొత్త కలెక్టరేట్‌లోని డిబ్లాక్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప నగర రిమ్స్ సమీపంలో గల స్పోర్ట్స్ స్కూల్‌ను సోమవారం శాప్ చైర్మన్ రవినాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో మమేకమై విద్యతో పాటు వివిధ ఆటలకు సంబంధించిన శిక్షణపై ఆరా తీశారు. అనంతరం వంటశాలకు వెళ్లి అక్కడున్న వంట సామగ్రి, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాలను తనిఖీ చేశారు. అదే సమయంలో వసతి గృహాలు మరమ్మతులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడున్న సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశా రు. ఇదిలావుండగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఇదివరకటి కంటే కూడా భోజనం నాణ్యత బాగుందని, వసతి గృహ సౌకర్యాలు కూడా మంచిగా వున్నాయని శాప్ చైర్మన్‌కు తెలిపారు.

సంతానోత్పత్తి కేంద్రాలు
నిబంధనలు తప్పక పాటించాలి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఏఆర్‌టీ క్లినిక్స్, ఏఆర్‌టీ బ్యాంక్స్, సరోగసీ సెంటర్లు కచ్చితంగా నిబంధనలు పాటించా లని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.నాగరాజు సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం కచ్చితంగా మార్గదర్శకాలు పాటించాలన్నారు. అన్ని ఏఆర్‌టీ క్లినిక్‌లు, ఏఆర్‌టీ బ్యాంకులు సంబంధిత అప్రాప్రియేట్ అథారిటీ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఐవీఎఫ్, యూఐయూ, ఐసీఎస్ఐ వంటి చికిత్సలు కేవలం అర్హులైన నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే జరగాలన్నారు. ఐవీఎఫ్, ఐయూఐ, ఐసీఎస్ఐ పరీక్షలు చేసే స్త్రీ వ్యాధి నిపుణులు వారి ఫెసిలిటీని తప్పనిసరిగా ఏఆర్‌టీ (లెవెల్-1)గా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. రోగుల నుంచి అవగాహనతో కూడిన సమ్మతి తప్పనిసరిగా పొందాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సరోగసీ విధానాన్ని జరిపితే 2021 ఏఆర్‌టీ/సరోగసీ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సంతానలేమి చికిత్సకోసం తప్పనిసరిగా నమోదైన క్లినిక్‌లను మాత్రమే సంప్రదించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నూతనకోర్సులు, అదనపు భవన నిర్మాణాలకు కృషి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ వంటి కోర్సులు నూతనంగా తీసుకురావడంతో పాటు అదనపు భవనాల నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, హెచ్ఓడీఎస్, పీఎం-ఉషా సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విద్య మానవవనరులశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం కడపలో పర్యటిస్తున్న సందర్భంగా ఆయనను కలిసి అభ్యర్థించనున్నామని తెలిపారు. అలాగే ఎంబీఏ బ్లాక్‌ను పూర్తి చేయడానికి నిధుల మంజూరు, క్యాంపస్‌లో అసంపూర్తిగా ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఇతర బ్లాక్‌లు పూర్తిచేయడానికి నిధులు కావాలని కోరుతామన్నారు. స్వయం ఆర్థిక ఆధారితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్వాంటం టెక్నాలజీస్ అమలు చేసే విషయమై చర్చించారు. విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ల పెరుగుదల, తరగతుల పర్యవేక్షణ గురించి చర్చించారు. సమావేశంలో డీన్‌లు విభాగాధిపతులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో మోసపోయాం

- మొక్కజొన్న రైతుల ఆవేదన



నాసిరకం మొక్క జొన్న కంకులతో ఏవో, రైతులు

ముద్దనూరు సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాసిరకం మొక్కజొన్న విత్తనాలతో మోసపోయామని మండలంలోని శెట్టివారిపల్లె రైతులు సోమవారం ఏవో వెంకటకృష్ణారెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని మధుసాయి ట్రేడర్స్‌లో మే 30వ తేదీ మైసీడ్స్ కంపెనీకి చెందిన సోహో 007 మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశామన్నారు. జూన్ 4వ తేదీ విత్తనం వేశామన్నారు. 120 రోజులకు పంట పూర్తవుతుందన్నారు. అయితే 90 రోజులకు కంకి విత్తనాలు రావాలన్నారు. అయితే విత్తనాలు కంకిలో అక్కడక్కడా వచ్చాయన్నారు.

ఎకరాకు దాదాపు రూ.25 వేల నుంచి 30వేలు ఖర్చు చేశామన్నారు. దాదాపు 70 ఎకరాల్లో 30 మంది రైతులు మొక్క జొన్న పంట సాగు చేశామన్నారు. తాడిపత్రిలోని మదుసాయి ట్రేడర్స్ వద్దకు వెళ్లి ఆందోళన చేశామని, అక్కడ వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఏవో వెంకటకృష్ణారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

శెట్టివారిపల్లె రైతులు తాడిపత్రిలోని మధుసాయి ట్రేడర్స్‌లో మొక్క జొన్న విత్తనాలు కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి బిల్లులు ఉన్నాయి. పంటను శాస్త్రవేత్తలు పరిశీలిస్తారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

-వెంకటకృష్ణారెడ్డి, ఏవో, ముద్దనూరు

గంగమ్మ ఒడికి గణనాథుడు



సుండుపల్లె: నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువకులు



గాలివీడులో..



పెనగలూరులో..

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): వినా యక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా బ్యాండు వాయిద్యాలు, టపా సులు, కోలాటాలు, హరికథలు, చెక్కభజనల నడుమ నిమజ్జనం నిర్వహించారు. కాకులారంలో రూ. 1,116కు హీరో భరత్ లడ్డును దక్కించుకున్నారు.

రామాపురం : మండలంలోని చిట్లూరు, నల్లగుట్ట పల్లె పంచాయతీ బీసీ కాలనీ, గోపగుడిపల్లె పంచా యతీ అడపలమాపల్లి, సరస్వతిపల్లిల్లో నిమజ్జ నాలు నిర్వహించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు గాలివీటి సురేంద్రారెడ్డి రూ.28 వేలకు, అడపల వెంకట్రమణ రూ.40 వేలకు లడ్డు దక్కించు కున్నారు.

గాలివీడు : మండల వ్యాప్తంగా పలు విగ్రహాల వద్ద లడ్డు దక్కించుకోడం కోసం ప్రజలు పోటీ పడ్డారు. నిమజ్జన కార్యక్రమానికి ఆటంకం లేకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోగా యువత నృత్యాలు చేస్తూ కోలాటాలు వేస్తూ వినాయకుడిని గంగ ఒడికి సాగనంపారు.

సుండుపల్లె: మండల కేంద్రంలోని శివాజీనగర్ శారదానగర్, చెన్నంశెట్టిపల్లి అగ్రహారం, మండ లంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్ర హాలను కృష్ణారెడ్డి చెరువులో, బాహుదా నదిలో గణనాథులను నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని శివాజీ నగర్‌లో బాబురెడ్డి రూ.81 వేలకు లడ్డు, కలశం చెంబు, రూపాయి కాయిన్‌ను దక్కించుకున్నబాబురెడ్డిని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

నందలూరు :అరవపల్లె గాంధీనగర్ ఆర్‌ఎస్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనా నికి తరలించారు. గాంధీ నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన వే లంలో వినాయకుడి లడ్డూను రూ.42,500కు గాదెన అరుణ్‌కుమార్ దక్కించుకున్నారు.

సిద్దవటం : మండలంలోని పాలకొండరాయుని పల్లెలో రాజంపేట జనసేనపార్టీనేతఅతికారి కృష్ణ పాల్గొన్నారు.

పెనగలూరు: ఇండ్లూరు హరిజనవాడ, అత్తిగారిపల్లె, హరిజన వాడ, సాతుపల్లె హరిజనవాడల్లో వసంతోత్సవం, నిమజ్జనం నిర్వహించారు

రాయచోటిటౌన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో మాండవ్య గణేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పూజ,లు చేశారు. అన్నదానాన్ని ప్రారంభించారు.



నందలూరు: నిమజ్జనానికి తరలి వెళుతున్న గణనాథుడు



చిన్నమండెం: రూ.2.81 లక్షలకు లడ్డును దక్కించుకున్న ఓర్సు మోహన్‌బాబు



రాయచోటి: అన్నదానం చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రూ.2.81 లక్షలు పలికిన వినాయకుడి లడ్డు

చిన్నమండెం: మండలంలోని కొత్తపల్లి పంచాయతీ శ్రీనివాసపురంలో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా రికార్డు స్థాయిలో వేలంపాటలు జరి గాయని చెప్పుకోవచ్చు. వినాయకుడి లడ్డును రూ.2.81 లక్షలకు ఓర్సు మోహన్‌బాబు , స్వామి వారికి సమర్పించిన పండ్లను రూ.1.25 లక్షలతో జయచంద్ర, చెరుకులను రూ.1.25 లక్షలకు సాయిలు సొంతం చేసుకొన్నారు. వారందరినీ కమిటీ సభ్యులు శాలువాలు, పూలదండలతో సత్కరించి మెరవణితో వారి ఇళ్ల వద్దకు తీసుకెళ్లారు.

పేరుకే ప్రభుత్వ వైద్యశాల

● డెప్యుటేషన్‌పై వెళ్లిన పలువురు ఉద్యోగులు ● సిబ్బంది కొరతతో అందని సేవలు



నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గాలివీడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏడు గ్రామాల ప్రజలకు ఎనలేని సేవలందించిన నూలివీడు ప్రాథమిక చికిత్స కేంద్రం ప్రస్తుతం సిబ్బంది కొరతతో సతమమతమవు తోంది . దీంతో అన్ని సౌకర్యాలు ఉన్నా తగినంత స్థాయిలో వైద్యం అందించ లేకపోతోంది.

నూలివీడు పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ముగ్గురు సూపర్‌వైజర్లు, ఒక ఫార్మసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియను, ముగ్గురు హెల్త్‌అసిస్టెంట్లు, ఒక సీనియర్ అసిస్టెంట్ పోస్టులు కలవు. రెగ్యులర్ స్టాఫ్ నర్సు 2023లో పీలేరు నియోజకవర్గంలోని చింతపర్తి పీహెచ్‌సీకి డెప్యుటేషన్‌పై వెళ్లడంతో ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వైసీపీ నాయకుల సిఫారసులతో చింతపర్తికి వెళ్లిన ఆమె డెప్యుటేషన్ ప్రభుత్వం మారినా రద్దు కాకపోవడం గమనార్హం. దీంతో గర్భిణులు ప్రసవం కోసం ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో రెండేళ్లుగా ఈ ఆస్పత్రిలో ఒక్క ప్రసవం కేసు కూడా నమోదు కాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇక్క ఒక్క సూపర్‌వైజర్ మాత్రమే ముగ్గురు నిర్వహించవల్సిన బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ డెప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. హెల్త్ అసిస్టెంట్లు ముగ్గురిలో ఇద్దరు పెండిమర్రిలో పనిచేస్తున్నట్లు సమాచారం. సీనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో ఆగస్టు నెలకు సంబంధించిన వేతనాల బిల్లులు కూడా చేయలేదని వైద్య సిబ్బంది తెలిపారు. ముఖ్యమైన వైద్య సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్య సేవలు అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా ప్రతి పల్లెలో వి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి డెప్యుటేషన్‌పై వెళ్లిన సిబ్బందిని రప్పించడంతోపాటు, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

న్యాయం చేయలేకపోతున్నాం

నూలివీడు పీహెచ్‌సీకి ప్రతిరోజు అధిక సంఖ్యలో వివిధ రకాల రోగులు వస్తున్నారు. వీరితో పాటు గర్భిణులు కూడా అధికంగా వస్తున్నారు. స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్లు లేకపోవడంతో వైద్య సేవలు అందించడంలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నాం. ముగ్గురు చేయవల్సిన పనులను ఒకరితోనే చేయించాల్సి వస్తున్నది. ఉన్నతాధికారులు స్పందించి డెప్యుటేషన్లు రద్దు చేయాలి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.

- భానుప్రకాశ్, వైద్యుడు, నూలివీడు పీహెచ్‌సీ

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

ఓబులవారిపల్లి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని కోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. సోమవారం కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డితో కలిసి మండలంలోని గోవిందంపల్లి గ్రామ పంచాయతీ శంకరాపురంలో గుండాల శిరీషకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.91 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లె టీడీపీ నాయకులు వాసుదేవ్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్ రాజు, కోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రాజు, బత్తిన వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నందలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ ఎస్టీ ఆర్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం అర్చకుడు సరసా రవికుమార్ ఆధ్వర్యంలో కుంకుమార్చన చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీఎం సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు



సీఎం సభకు వెళుతున్న టీడీపీ నేతలు

సిద్దవటం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 18 గ్రామ పంచాయతీల నుంచి టీడీపీ ప్రజాప్రతినిధులు సీఎం సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొననున్న సభకు సిద్దవటం మండలం నుంచి 37 టాటా ఏస్ వాహనాలు, 27 ద్విచక్ర వాహనాల్లో తరలివెళ్లారు, ఖాదర్ బంగ్లా, జ్యోతి, పెన్నానదిపై వంతెన నిర్మాణం అంశాలు సీఎం దృష్టికి తీసుకెళతామని, మండల ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేసే విధంగా కృషి చేస్తామని, తెలుగుదేశంపార్టీ ప్రజాప్రతినిధులు ప్రతిఒక్కరు పార్టీ ఐక్యత కోసం కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

74 వాహనాల్లో తరలిన టీడీపీ నాయకులు

సుండుపల్లె: రాజంపేటలో పించన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తుండడంతో సుండుపల్లె నుంచి 74 వాహనాల్లో టీడీపీ నాయకులు తరలివెళ్లినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కళ్లే రెడ్డెప్ప తెలిపారు.

పెనగలూరు: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి వర్గీయులు వేరువేరుగా రాజంపేటకు తరలివెళ్లారు. వీరిలోబీఎల్ నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, మాజా సర్పంచ్‌కె.వెంకటసుబ్బయ్య, టి. ధనయ్య, ఎం. మురళి, తుమ్మల రమణయ్యనాయుడు తదితరులు తరలి వెళ్లారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు: సీపీఎం



మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఎం సీనియర్ నాయకుడు లింగాల యానాదయ్య తెలిపారు. సోమవారం సీఐటీయూ రైల్వేకోడూరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో బొప్పాయి దళారీలు చేస్తున్న మోసాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్ర శేఖర్, మండల కార్యదర్శి పీ. జాన్‌ప్రసాద్ తదితరులను పోలీసులు ఆది వారం అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల్లోకి వస్తున్న కూటమి నాయకులకు విన్నపాలు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోడి సుబ్బరామయ్య, బండారు రాజశేఖర్, ఎస్. లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లి : వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం. జయరామయ్య, సీఐటీయు జిల్లా నాయకులు రేకులకుంట వెంకటేష్ మాట్లాడుతూ . రైతుల ఆవేదన ముఖ్యమంత్రి దృష్టికి ఎక్కడ తీసుకెళ్తామేమోనని ముందస్తుగా అరెస్టు చేశారని ఆరోపించారు. అరెస్టుతో ఉద్యమాలను ఎవరు ఆపలేరన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మరియు సీఐటీయు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ అందరి బాధ్యత

● కడప అర్బన్ ప్రాజెక్టు ఐసీడీసీఎస్ సీడీపీవో వాణిశ్రీ

సిద్దవటం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాలల రక్షణ మనందరి బాధ్యతని కడప అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో వాణిశ్రీ అన్నారు. సిద్దవటం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 1098 మిషన్ వాత్సల్య స్కీములపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీం అధికారి సునీత మాట్లాడుతూ 1098 పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఉచిత సేవా ఫోన్ నంబరు అని, 24/7 అందుబాటులో ఉంటుందన్నారు. పిల్లలకు ప్రమాదాలు ఎదురైనప్పుడు, హింసకు గురైనప్పుడు రక్షణ కోసం 1098కు కాల్ చేయాలన్నారు. బాల్య వివాహాలు, దౌర్జన్యాలు, లైంగిక వేధింపులు, తప్పిపోయిన పిల్లల గురించి, బస్టాండులో, రైల్వేస్టేషన్‌లో దిక్కులేకుండా తిరుగుతున్న అనాథ పిల్లల రక్షణ, సంరక్షణ కోసం 1098కు కాల్ చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయని, ఈ పథకం ముఖ్య ఉద్దేశం బాలల హక్కుల సంరక్షణ, సురక్షిత వాతావరణం, వికాసం, పునరావసం అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో శోభారాణి, ఉపాధ్యాయురాలు సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు వరలక్ష్మీదేవి, శ్రీవిద్య, ఏఎన్‌ఓ అంజనమ్మ, ఎంఎస్‌కే శోభాలత, ఆశా కార్యకర్తలు ఓబులమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు రామలక్ష్మీ, షమీనా, సావిత్రి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో ఉన్నత విద్య, ఉద్యోగాలపై అవగాహన



హరీశ్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం

రామాపురం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జపాన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ (ఎన్‌ఐసీటీ)లో సహాయక పరిశోధకుడిడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ) నిపుణు డు హరీష్ కుమార్ మాట్లాడుతూ జపాన్‌లో ఎంఎస్ చదువు, ఉద్యోగాలను సం పాదించే ప్రక్రియపై మార్గదర్శనం చేశారు. జపాన్ పరిశ్రమల్లో ఉద్యోగాలకు అవసరమైన అర్హతలు, దరఖాస్తు విధానాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీ ఎస్ రెడ్డి, చైర్మన్ మన్నూరు భాస్కర్, ఆయనను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

తైక్వాండోలో మండల విద్యార్థికి బంగారు పతకం



సుశాంత్

సిద్దవటం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో నిర్వహించిన రాయలసీమ స్థాయి తైక్వాండో పోటీల్లో ఎస్. రాజంపేట గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన బావ నాసి సుశాంత్ అనే విద్యార్థికి జోనల్‌స్థాయిలో బంగారు పతకం లభించింది. అతను చదువుతున్న భారతి స్కూల్ ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

పెరటి తోటలు పెంచాలి

పీలేరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పెరటి తోటల పెంపకంపై ప్రత్యేక చొరవ చూపాలని మండల ఉద్యాన శాఖ అధికారి సుకుమార్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని ఒంటిల్లు వద్ద పెరటితోటల పెంపకంపై మహిళా రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విపరీతంగా ఎరువులు, పురుగు మందులు వాడి పండించిన కూరగాయలు, ఇతర ఉత్పత్తులను వినియోగించడం వల్ల తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నామని తెలిపారు. అనంతరం 50 మందికి పెరటితోట విత్తనాల మినీ కిట్స్ అందించారు.

రోప్ స్కిప్పింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ



రన్నర్స్‌గా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా డోన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌షిప్ రన్నర్స్‌గా నిలిచారు. సోమవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ డోన్‌లో నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి పలు జిల్లాల జట్లు పాల్గొన్నాయన్నారు. ఇందులో అన్నమయ్య జిల్లా జట్టు నుంచి పాల్గొన్న మదనపల్లె విద్యార్థులు ఉమెన్స్ డబుల్ టచ్ టీమ్‌రిలేలో విజయం సాధించగా, మెన్స్ డబుల్ అండర్ టీమ్ రిలేలో విజేతలుగా నిలిచారన్నారు. దీంతో పాటు స్పీడ్‌స్ప్రింట్ మెన్, ఉమెన్ విభాగంలో ఏడు బంగారు పతకాలు, 4 రజత పతకాలు సాధించారన్నారు. అనంతరం రాష్ట్ర జట్టుకు నిర్వహించిన ఎంపికలో మదనపల్లెకు చెందిన ఒక బాలుడు, ఏడుగురు బాలికలు ఎంపికయ్యారని, వీరు వచ్చే నెల ముంబైలో నిర్వహించే జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్ అభినందించారు.

రైతు బలమే దేశం బలం : షఫీ

● నాయనబావి వద్ద సినీ నటుడి పర్యటన



నాయనబావి వద్ద స్థానికులతో సినీ నటుడు షఫీ

బి.కొత్తకోట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతు బలంగా, క్షేమంగా ఉన్నప్పుడే దేశం కూడా బలంగా ఉంటుందని సినీనటుడు షఫీ అభిప్రాయపడ్డారు. ఖడ్గం, ఛత్రపతి లాంటి పలు సినిమాలలో నటించిన సినీనటుడు షఫీ సోమవారం బి.కొత్తకోట మండల పరిధిలోని నాయనబావి గ్రామంలో పర్యటించారు. చంద్రగిరికి చెందిన షఫీ గతంలో పలుమార్లు హార్సిలీహిల్స్, బి.కొత్తకోటలో పర్యటించారు. అదే క్రమంలో హార్సిలీహిల్స్ దిగువభాగంలో వున్న నాయనబావి గ్రామంలో కొంతభూమిని కొనుగోలు చేసిన వ్యవసాయ క్షేత్రంలో ఆయన కుటుంబంతో పాటు ఆత్మీయులతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులను అన్ని విధాలా ఆదుకొని వ్యవసాయరంగానికి చేయూతనివ్వాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియన వ్యక్తి సోమవారం పట్టణంలోని కోమటివాని చెరువు సమీపంలో మృతి చెందినట్టు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణం నడిబొడ్డున్న ఉన్న కోమటివాని చెరువు సమీపంలో 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది పడిఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే టూటౌన్ పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీంచి చిత్తుకాగితాలు ఏరుకునే వ్యక్తిగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు గడ్డం పెంచుకుని, ఖాకీ చొక్కా వేసుకుని ఉన్నాడని, మృతిని సమాచారం తెలిసిన వారు 9491074519, 9440796741నంబర్లకు తెలపాలని సీఐ కోరారు.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన చంద్రకళ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని సోమవారం ఉదయం మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణం నక్కలదిన్నె తాండాలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం నక్కలదిన్నె తాండా చుక్కల తాండాకు చెందిన చంద్రకళ (27) తన భర్త చంద్రశేఖర్ నాయక్ రేషన్ బియ్యం కోసం వెళ్లగా ఇంట్లో ఎవ్వరూ లేని సమయం చూసుకుని ఉరి వేసుకుంది. అనంతరం వచ్చిన భర్త స్థానికులతో కలిసి చంద్రకళను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

లారీ ఢీకొని స్కూటరిస్టు మృతి



మృతి చెందిన శ్రీనివాసులు ఫైల్‌ఫొటో

పుల్లంపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట సమీపంలో సోమవారం లారీ ఢీకొని పుత్తనవారిపల్లె గ్రామానికి చెందిన ఉమ్మడి శ్రీనివాసులు(44) అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పయ్యరాజుపేట వద్ద పెట్రోల్ బంకులో పనిచేస్తున్న శ్రీనివాసులు విధులకు వెళుతుండగా తిరుపతి వైపు నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసులు మరణవార్త విని పుత్తనవారిపల్లె గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ సంఘటనపై ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు స్కూటర్లు ఢీ

● ఇరువురికి గాయాలు

అట్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లె వద్ద సోమవారం సాయంత్రం రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఎస్.వెంకటాపురంలోని ఉప్పటూరు కాలనీకి చెందిన శ్రీబాబుకు తీవ్ర రక్తగాయాలు కాగా గోపినాధపురానికి చెందిన నరసింహారెడ్డికి స్వల్పగాయాలైనట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఇరువురినీ 108 వాహనంలో కడప రిమ్స్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే ఇరువురూ మూగవారు కావడం గమనార్హం. శ్రీబాబు బద్వేలు రూటు నుంచి సిద్దవటం వైపు వెళుతుండగా, సిద్దవటం వైపు నుంచి గడ్డిమోపు బండిపై పెట్టుకుని నరసింహారెడ్డి ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. నుజ్జునుజ్జు అయిన స్కూటర్లను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీ కోసం కష్టపడని వారిని

నిర్మొహమాటంగా తొలగిస్తాం

● వచ్చే ఎన్నికల్లో రాజంపేటలో భారీ మెజార్టీతో గెలుస్తాం ● రాష్ట్రంలో 175కు 175 స్థానాలు గెలుస్తాం

● పులివెందులను సైతం గెలిపించుకుంటాం ● కార్యకర్తల సమావేశంలో చంద్రబాబునాయుడు





కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. హాజరైన రాజంపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

రాజంపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సొంత పనులు చూసుకుంటూ పార్టీ అభ్యున్నతికి పాటుపడని ఏ నాయకుడినైనా నిర్మొహమాటంగా మార్చివేస్తామని, క్లస్టర్ ఇన్‌చార్జి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి వరకు ఏ స్థాయిలో ఉన్న నాయకుడికైనా ఇది వర్తిస్తుందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబునాయుడు హెచ్చరించారు. సోమవారం రాజంపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందరూ కలిసికట్టుగా బాధ్యత తీసుకుని నియోజకవర్గంలో బలమైన నాయకత్వాన్ని నెలబెట్టుకోవాల్సిన బాధ్యత మీదేనన్నారు. బలమైన నాయకత్వాన్ని మీరు నిలబెట్టుకుని పార్టీని బలపరచి గెలిపించుకుంటే మీ అందరినీ అన్నివిధాల గౌరవించే బాధ్యత తీసుకుంటానన్నారు. పులివెందులతో పాటు ఒంటిమిట్టలో మీ సత్తా చాటి జడ్పీటీసీలను గెలిపించుకున్నారని, అదే స్ఫూర్తితో ముందుకుపోవాలన్నారు. ఎన్డీయే కూటమి ఓడిపోయే పరిస్థితి ఉండదని, సూపర్‌సిక్స్ పథకం సూపర్ హిట్ అయిందని, సంక్షేమం, అభివృద్ధిలో మనకు ఎవరూ సాటి రారన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ నుంచి గ్రామ, మండల, నియోజకవర్గ నాయకులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తీరుస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రతినెలా పంపిణీ చేసే పెన్షన్ల కార్యక్రమంలో గ్రామ నాయకులు విధిగా పాల్గొంటూ వారికి సాధక బాధకాలు తెలుసుకుని పరిష్కరిస్తే మీ నాయకత్వానికి తిరుగు ఉండదన్నారు. అలా కాకుండా సొంత పనులు చూసుకుంటూ పార్టీని గాలికి వదిలేస్తే వారిపై ఎప్పటికప్పుడు విచారణ చేసి వారు సక్రమంగా పనిచేయకపోతే మార్చివేయడం తథ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు, మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఆస్పత్రులపై చర్యలు : డీఎంహెచ్‌వో

● సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీలు



ఐయూఐ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

రాయచోటిటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 11 ఐయూఐ కేంద్రాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, అనుమతులు లేని ఆస్పత్రులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య తెలిపారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని సంతాన సాఫల్య కేంద్రాలలో సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లి కావాలనుకున్న సంతానం లేని దంపతులకు సహాయ పడాల్సిన కొన్ని ఆసుపత్రులు మోసపూరిత కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. ఈ మధ్య వార్తల్లోకి వచ్చిన హైదరాబాద్, వైజాగ్, గుంటూరు, విజయవాడ వంటి పెద్ద నగరాలకు పరిమితమైన ఐవీఎఫ్ కేంద్రాలు ప్రస్తుతం జిల్లా స్థాయికి విస్తరిస్తున్నాయన్నారు. జిల్లా కేంద్రంలో 11 ఐయూఐ ఆసుపత్రులకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ అనుమతులు లేని ఆసుపత్రులు గైనకాలజిస్టుల ఆధ్వర్యంలో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ పిల్లలు లేని దంపతులకు ఆశలు కల్పిస్తూ ఉచిత కన్సల్టెన్సీ, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇటీవల సికింద్రాబాద్‌లో సృష్టి హాస్పిటల్‌లో జరిగిన సంఘటన రెండు తెలుగు రాష్ట్రాలలో కలకలం రేపడంతో ప్రభుత్వం స్పదించి జిల్లా వ్యాప్తంగా సంతాన సాఫల్య కేంద్రాలను, అనుమతులు లేకుండా ఉన్న ఆసుపత్రులను తనిఖీలు నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని 11 ఐయూఐ కేంద్రాలను తనిఖీలు నిర్వహించామని తెలిపారు.

గండికోట నుంచి 7,500 క్యూసెక్కులు విడుదల



కొండాపురం/మైలవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి సోమవారం సాయింత్రం నుంచి 7,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు ఈఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 10,700 క్యూసెక్కులు, వరదనీరు మరో 600 క్యూసెక్కులు వచ్చి చేరినట్లు తెలిపారు. కాగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.15 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటివిడుదల జరుగుతుందని జలాశయ ఈఈ రమేష్ సోమవారం తెలిపారు. జలాశయం నుంచి పెన్నానదికి 10 వేల క్యూసెక్కులు, ఉత్తర, దక్షిణ కాలువలకు 200 క్యూసెక్కుల మేర నీటి విడుదల కొనసాగుతోంది. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయంలో అయిదు వేల క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోంది.

గోడ కూలి విద్యార్థికి గాయాలు



గాయపడిన విద్యార్థి భరత్

తంబళ్లపల్లె, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని మరుగుదొడ్డి గోడ కూలి పదో తరగతి విద్యార్థి గాయపడిన సంఘటన సోమవారం తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. ఆ వివరాల్లోకి వెళితే.. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న భరత్ సోమవారం మధ్యాహ్నం ఇంటర్వెల్ సమయంలో పాఠశాలలో ఉన్న పాత బాత్‌రూమ్‌కు వెళ్లాడు. ఆ సమయంలో గతంలో పగుళ్లు ఏర్పడి దెబ్బతిని ఉన్న గోడ అకస్మాత్తుగా కూలి భరత్ కుడి కాలిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలపడంతో హెచ్‌ఎం దామోదర్‌రెడ్డి వెంటనే విద్యార్థిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించి వైద్య చికిత్సలందించారు. మొకాలి పైభాగంలో ఎముక విరగడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి బర్డ్ ఆసుపత్రికి తరలించారు. కాగా, పాఠశాలలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ఉపాధ్యాయులు వినియోగించే క్రమంలో విద్యార్థులకు అనుమతి లేకపోవడం వల్లనే శిథిలావస్థలో ఉన్న పాత మరుగుదొడ్లను విద్యార్థులు వినియోగిస్తున్నారని, ఈ క్రమంలోనే గోడ కూలి భరత్ తీవ్రంగా గాయపడ్డాడని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రేమను నిరాకరించిందని..

యువకుడి ఆత్మహత్య

● మృతుడు ఉత్తరప్రదేశ్ వాసిగా గుర్తింపు



మృతి చెందిన అర్జున్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రియురాలు తన ప్రేమను నిరాకరించిందని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు ఆదివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రైల్వేకోడూరులో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ (24) మెకానిక్‌గా తిరుపతిలోని ఒక షోరూంలో పని చేసి ఆరు నెలల కిందట రైల్వేకోడూరుకు వచ్చి హీరో షోరూంలో పని చేస్తున్నాడు. రైల్వేకోడూరు ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు పక్కనే నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా ఉత్తరప్రదేశ్‌లోని ఒక అమ్మాయి ప్రేమలో పడ్డాడు. ఆదివారం రాత్రి ప్రేమించిన అమ్మాయితో ఫోన్‌లో మాట్లాడాడు. తన ప్రేమను నిరాకరించడంతో నివాసముంటున్న ఆ ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అమ్మాయికి చేసిన ఫోన్ నెంబర్లు, అర్జున్ తల్లిదండ్రులు, బంధువుల ఫోన్ నెంబర్లు సేకరించి జరిగిన సంఘటనపై సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

● తృటిలో తప్పిన ప్రమాదం

రైల్వేకోడూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ ప్రధానదారిలో ఓ కారు సోమవారం అదుపుతప్పడంతో ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. కారు డ్రైవింగ్ చేస్తున్న సుబ్రహ్మణ్యంరెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడని స్థానికులు తెలిపారు. గాయపడిన వ్యక్తి స్వగ్రామం మంగంపేట కాపుపల్లెగా గుర్తించారు. ప్రమాదం తృటిలో తప్పింది. ఈ మేరకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

భాకరాపేట సమీపంలో...



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

సిద్దవటం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలోని భాకరాపేట సమీపంలో పెనుప్రమాదం తప్పింది. సోమవారం కడప నగరానికి చెందిన రమణ తన కుటుంబ సభ్యులతో కలిసి రేణిగుంటకు కారులో బయలుదేరాడు. సిద్దవటం మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి భాకరాపేట సమీపాన రోడ్డుపైకి ఆవు అడ్డురావడంతో కారు అదుపు తప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయంపై ఎస్ఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరగా జరిగిన ఘటన స్థలానికి వెళ్లి చూశామని, ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. వాహనదారులు జాతీయ రహదారిపై నెమ్మదిగా వెళ్లాలని, అతివేగం ప్రమాదకరమని సూచించారు.

రెండు డీఏలను వెంటనే ప్రకటించాలి

● నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస రాజు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు బకాయిలు ఉన్న నాలుగు కరువు భత్యాల్లో కనీసం రెండింటిని వెంటనే విడుదల చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస రాజు అన్నారు. సోమవారం పట్టణంలోని నోబుల్‌టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి వెంటనే ఓపీఎస్‌ను ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ అసోసియేషన్ నాయకులు రవిశంకర్, ప్రభాకర్, రవి, రమణ, ఆనంద్, సుబ్బరాజు, మల్లికార్జున, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



తంబళ్లపల్లె సీఎస్ డీటీ.. ఆస్తుల జప్తునకు శ్రీకారం

● వివరాలు పంపాలని జేసీ ఆదేశం
● ఆర్ఆర్ యాక్టు అమలుకు చర్యలు



తంబళ్లపల్లెలోని అప్పటి సివిల్ సప్లయ్ గోదాము

మదనపల్లె, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె పౌరసరఫరాల శాఖ గోదాము డీటీ పి.హరిప్రసాద్ ఆస్తుల జప్తునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌చైర్మన్ విజయవాడ, ఆదేశాల మేరకు రెవెన్యూ రికవరీ యాక్టు(ఆర్ఆర్)లో భాగంగా జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పేరున, ఆయన కుటుంబ సభ్యుల పేరున ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలు వెంటనే పంపాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, మదనపల్లె తహసీల్దార్లను ఆదేశించారు. ఇందులో రెవెన్యూ రికార్డులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రికార్డుల మేరకు ఆస్తులు గుర్తించాలని సూచించారు. హరిప్రసాద్ తంబళ్లపల్లెలో 2022లో డీటీగా, గోదాము ఇన్‌చార్జిగా పని చేశారు. అప్పట్లో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారని ఆ శాఖ అధికారులు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.9.22కోట్లు ఉంటుందని లెక్క గట్టి డీటీకి నోటీసులు జారీ చేశారు. అనంతరం డీటీ సస్పెండ్ కావడంతో పాటు తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. సస్పెన్షన్‌లో ఉన్న డీటీకి తర్వాత పెండింగ్ ఎంక్వయిరీ కింద తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన రాయచోటి ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పని చేస్తున్నారు.

ఏం జరిగిందంటే..!

తంబళ్లపల్లె పౌరసరఫరాల గోదాము కేంద్రంగా రేషన్ బియ్యంలో భారీ స్కామ్ చోటుచేసుకుంది. 995 టన్నుల రేషన్ బియ్యం, కార్డుదారులకు అందజేసే కందిపప్పు, చక్కెర మాయమయ్యాయి. రూ.కోట్ల స్కామ్‌లో అప్పటి సీఎస్ డీటీ హరిప్రసాద్, గోదాములో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ సదాశివగా గుర్తించారు. దీనిపై సీఎస్ డీటీని సస్పెండ్ చేయగా, కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుండి శాశ్వతంగా తొలగించారు. ఇరువురిపైనా కేసులు నమోదు చేశారు. ఇక్కడి గోదాము నుంచి తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం మండలాల్లోని రేషన్ షాపులకు సరుకులు సరఫరా చేస్తున్నారు. స్టేజీ-1(రేణిగుంట) నుంచి స్టేజీ-2కు (గోదాము) వచ్చిన 995 టన్నుల బియ్యం, 20టన్నుల కందిపప్పు, రెండుటన్నుల చెక్కర గోల్‌మాల్ కాగా ప్రభుత్వ లెక్కల ప్రకారం వీటి విలువ రూ.4కోట్లు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

కలిసొచ్చిన ఉచిత బియ్యం

కరోనా ప్రభావం, లాక్‌డౌన్ నేపథ్యంలో పేద ప్రజలను ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం గరీబ్ కళ్యాణ్‌అన్నయోజన(పీఎంజీకేవై) పథకంలో పేదలకు ఒక్కొక్కరికి అయిదు కేజీల చొప్పున 2020 ఏప్రిల్ నుంచి ఉచిత బియ్యం పంపిణీ చేసింది. ఇందులో భాగంగా ప్రతినెలా రెగ్యులర్ పీడీఎస్‌తో పాటు కేంద్రం ఉచితబియ్యం అదనంగా ఇచ్చింది. ఇందులోభాగంగా స్టేజీ-1(ఎంఎల్ఎస్ కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే కేంద్రం) రేణిగుంట, ఏర్పేడు, నెల్లూరు, తదితర ప్రాంతాల నుంచి తంబళ్లపల్లె గోదాము(స్టేజీ-2) లారీలతో లోడ్‌లకు లోడ్లు దింపేశారు. ఒకేనెలలో రెండు కోటాలకు కార్డుదారులకు సరుకులు ఇవ్వాల్సి రావడంతో బియ్యాన్ని డంప్ చేశారు. ఈ క్రమంలోనే అక్రమాలకు ఆస్కారం ఏర్పడింది. స్థానికంగా వచ్చిన స్టాకు దింపుకునేందుకు స్థలం లేకపోవడంతో ముందస్తుగా చౌకదుకాణాలకు కొన్ని, మరికొన్ని బస్తాలు దారి మళ్లించారు.

భారీ స్కామ్ బయటపడిందిలా..

స్టేజీ-1 నుంచి తంబళ్లపల్లె(స్టేజీ-2)కు సరఫరా చేసిన బియ్యానికి, గోదాము నుంచి వచ్చిన లెక్కలకు ఏమాత్రం పొంతన కుదరలేదు. రీకన్సలేషన్‌లో ప్రతినెలా అడ్వాన్సుగా తేలామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో చౌకదుకాణాల్లో స్టాకూ లేదు. ఉచిత బియ్యం సరఫరా కూడా ఆగిపోవడంతో అమ్మేసిన బియ్యం లోటును పూడ్చలేకపోయారు. అలాగే కందిపప్పు, చక్కెర సరఫరా కూడా ఆగిపోయింది. తర్వాత లోటు బియ్యాన్ని ఎక్కడైనా కొని తెద్దామంటే స్టాకూ లేదు. మరోవైపు విజిలెన్స్, పోలీసు నిఘా విస్తృతంగా ఉంది. తీరా అధికారులు తనిఖీ చేస్తే గోదామూ ఖాళీగా వుంది. స్టేజీ వన్ నుంచి స్టేజీ-2కి రావాల్సిన బియ్యం అక్కడి నుంచి అట్లే దారి మళ్లినట్లు గుర్తించారు. సాంకేతికత, వాహనం ట్రాకింగ్, తదితర అంశాల ఆధారంగా స్కామ్‌ను బయటపెట్టారు. ఈ బియ్యం స్కామ్ తేల్చడానికి అప్పటి కలెక్టర్ పి.ఎస్.గిరీష ముగ్గురు సభ్యులతో కూడిన బృందాన్ని నియమించారు. ఇందులో సభ్యులైన సివిల్‌సప్లయ్ డీఎం శ్రీనివాస్, డీఎస్‌వో రఘురాం, ఆర్డీవో ఎం.ఎస్.మురళి విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అలాగే డీఎం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నామినేటెడ్ పోస్టులు ఎప్పుడు?

- అధికారం వచ్చి ఏడాది దాటినా భర్తీ కాని వైనం
- వలస బ్యాచ్‌లకే పార్టీలో ప్రాధాన్యం
- ఎమ్మెల్యేలకు, కేడరుకు మధ్య పెరిగిన అగాధం
- రగులుతున్న పసుపుసైన్యం

యువనేత, మంత్రి నారా లోకేశ్ టీడీపీకి భవిష్యత్తు ఆశాకిరణం. కార్యకర్తల కోసం ఎంతకైనా తెగిస్తారని ఆయనకు పేరుంది. అందుకే తక్కువ కాలంలోనే కేడరు లోకేశ్‌ను సొంతం చేసుకుంది. తమ భవిష్యత్ నేతగా ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. అలాంటి నేత మంగళవారం జిల్లాలో పర్యటిస్తున్నారు. మంత్రి హోదాలో పరిశ్రమలు, కళాశాల, స్మార్ట్ కిచెన్ సెంటర్లను ప్రారంభించనున్నారు.. కేడరు మాత్రం ఈ పర్యటనపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నవారు తమకు లోకేశ్ భరోసా ఇస్తారని ఆశిస్తున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ సొంత జిల్లాలో టీడీపీకి కరుడుగట్టిన పసుపు సైన్యం ఉంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కూటమికి ఏడు అసెంబ్లీ సీట్లు కట్టబెట్టారు. తరువాత జరిగిన మహానాడు సూపర్ సక్సెస్ అయింది. ఇటీవల పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో జగన్‌కు మైండ్ బ్లాక్ చేసేలా టీడీపీకి పట్టం గట్టారు. టీడీపీపై, ఇటు పార్టీపై అభిమానం చూపుతున్నారు. అయితే అదే స్థాయిలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో జిల్లాలోని కరుడుగట్టిన ఫ్యాన్స్‌కు న్యాయం చేయకపోవడంతో కేడరు నిస్తేజంగా ఉంది.

పదవుల కోసం వెయిటింగ్

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. అయితే కొన్ని చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు /ఇన్‌చార్జిలు కేడరు మధ్య భారీ గ్యాప్ వచ్చింది. తొలి ఆరు నెలల వరకు బాగున్నా తరువాత ఒక్కసారిగా కేడరులో అసంతృప్తి రగులుకుంది. కొందరు ఎమ్మెల్యేల తీరు మరీ అధ్వాన్నంగా ఉంది. టీడీపీ కేడరు కష్టపడితే గెలిచామన్న విషయాన్ని వదిలేసి తమ స్వశక్తితోనే గెలిచామనే స్థాయికి వచ్చేశారు. కేడరును పూర్తిగా వదిలేశారు. ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడంతా టీడీపీలో ఇలాంటివారిదే పెత్తనం. దీంతో ముఖ్యంగా బలిజ, బీసీ, ఎస్టీ కులాల్లో అసంతృప్తి ఉంది. వారిని పట్టించుకోవడం వదిలేసి ఒక సామాజికవర్గాన్నే నెత్తిన పెట్టుకుంటున్నారని అంటున్నారు. ఈ వ్యవహారాన్ని పట్టించుకోకపోతే ఆ ప్రభావం రాబోవు రోజుల్లో కనిపిస్తుందని టీడీపీ అభిమానులు ఆందోళన చెందుతున్నారు.



మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత, పుత్తా చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, వరదరాజులరెడ్డి, మాధవిరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, భూపేశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయమ్మ, సురేశ్‌నాయుడు తదితరులు

సమన్వయం ఏదీ?

సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఏడు సీట్లు కట్టబెట్టారు. ఏడాది పాలనపై జనంలో మంచి అభిప్రాయం ఉంది. అయితే ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి గ్రౌండ్ స్థాయిలోకి వెళ్లడంలేదు. పసుపుజెండా కనిపిస్తే చెవి కోసుకునే కేడరును అంతా ఇప్పుడు నేతలు పట్టించుకోవడంలేదు. వారిని నిర్వీర్యం చేశారు. దీంతో పాటు జిల్లాలో టీడీపీ నాయకుల మధ్య సమన్వయం, సఖ్యత లేదు. టీడీపీలో ఉన్నత పదవులు పొందిన మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్‌ను లక్ష్యంగా ఘోరంగా విమర్శలు చేస్తున్నారు. ఆ విమర్శలను జిల్లాలో టీడీపీ నేతలు తిప్పికొట్టలేక పోతున్నారు. బీటెక్ రవి మాత్రమే కౌంటరు ఇస్తుండగా మిగతా నేతలంతా చేతులెత్తేశారు. ఇక సూపర్‌సిక్స్ ఇతర పథకాల అభివృద్ధిపై వైసీపీ నేతలు అటు నేరుగా మీడియా, సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నప్పటికీ ధీటుగా బదులివ్వకపోవడం గమనార్హం. మహానాడు మినహాయిస్తే టీడీపీలో ఒక్క ప్రోగ్రాం కూడా వేదికపై లేదు. తెలుగుగంగ ప్రాజెక్టు, సాగునీరు, చేనేతలకు ఉచిత విద్యుత్.. ఇలా ఎన్నో కార్యక్రమాలు ఉన్నప్పటికీ కూడా ఒక్క కార్యక్రమం చేసి జగన్ బ్యాచ్‌కు ధీటుగా ఇప్పటి వరకు సమాధానం చెప్పలేదు.

కడప జిల్లాలో కేవలం సిక్స్ అవర్స్ పాలిటిక్స్ చేస్తారనే చర్చ ఆ వర్గాల్లో ఉంది. పగలు టీడీపీతో రాత్రి వైసీపీ బ్యాచ్‌తో ఉంటారనే ప్రచారం ఉంది. జగన్ హయాంలో మంత్రి నారా లోకేశ్‌ను ఓ యూట్యూబ్ స్టార్ ఘోరంగా విమర్శించారు. ఆ స్టార్‌తో ఓ నేత డీల్ చేసుకున్నారన్న చర్చ ఉంది. వచ్చే ఎన్నికలకు జిల్లాలో పార్టీ బలోపేతం చేయాలంటే ముఖ్యంగా రాజకీయంగా అందరినీ ఏకతాటిపైకి తెచ్చుకోవాలి. జగన్ చేయని అభివృద్ధిని చేసి చూపించాలి. పులివెందులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. పార్టీలోని చీడ పురుగులను, వైసీపీతో రాత్రిపూట అంటకాగే బ్యాచ్‌ను తీవ్రంగా మందలించాలి. లేదా పార్టీ కార్యక్రమాలకు అలాంటి వారిని దూరం పెట్టాలి. టీడీపీ వీరాభిమానులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

సంతానోత్పత్తి కేంద్రాలు నిబంధనలు తప్పక పాటించాలి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఏఆర్‌టీ క్లినిక్స్, ఏఆర్‌టీ బ్యాంక్స్, సరోగసీ సెంటర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం కచ్చితంగా మార్గదర్శకాలు పాటించాలన్నారు. అన్ని ఏఆర్‌టీ క్లినిక్‌లు, ఏఆర్‌టీ బ్యాంకులు సంబంధిత అప్రాప్రియేట్ అథారిటీ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఐవీఎఫ్, యూఐయూ, ఐసీఎస్ఐ వంటి చికిత్సలు కేవలం అర్హులైన నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే జరగాలన్నారు. ఐవీఎఫ్, ఐయూఐ, ఐసీఎస్ఐ పరీక్షలు చేసే స్త్రీ వ్యాధి నిపుణులు వారి ఫెసిలిటీని తప్పనిసరిగా ఏఆర్‌టీ (లెవెల్-1)గా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. రోగుల నుంచి అవగాహనతో కూడిన సమ్మతి తప్పనిసరిగా పొందాలన్నారు. నిబంధ నలకు విరుద్ధంగా వాణిజ్య సరోగసీ విధానాన్ని జరిపితే 2021 ఏఆర్‌టీ/సరోగసీ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సంతానలేమి చికిత్స కోసం తప్పనిసరిగా నమోదైన క్లినిక్‌లను మాత్రమే సంప్రదించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో తెలిపారు.

నూతనకోర్సులు, అదనపు భవన నిర్మాణాలకు కృషి : వీసీ

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ వంటి కోర్సులు నూతనంగా తీసుకురావడంతో పాటు అదనపు భవనాల నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయరామి రెడ్డి, హెచ్‌ఓడీఎస్, పీఎం-ఉషా సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విద్య మానవవన రులశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం కడపలో పర్యటిస్తున్న సందర్భంగా ఆయనను కలిసి అభ్యర్థించనున్నామని తెలిపారు. అలాగే ఎంబీఏ బ్లాక్‌ను పూర్తి చేయడానికి నిధుల మంజూరు, క్యాంపస్‌లో అసంపూర్తిగా ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఇతర బ్లాక్‌లు పూర్తిచేయడానికి నిధులు కావాలని కోరుతామన్నారు. స్వయం ఆర్థిక ఆధారితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్వాంటం టెక్నాలజీస్ అమలు చేసే విషయమై చర్చించారు. విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ల పెరుగుదల, తరగతుల పర్యవేక్షణ గురించి చర్చించారు. సమావేశంలో డీన్‌లు విభాగాధిపతులు పాల్గొన్నారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి...తీవ్రగాయాలు

పులివెందుల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలతో కృష్ణయ్య యాదవ్ అనే వ్యక్తిపై ఇరువురు కట్టెలతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు లింగాల మండలం బోనాలకు చెందిన కృష్ణయ్య యాదవ్ సింహాద్రిపురం మండలం అంకాళమ్మగూడూరుకు చెందిన నాగరాజుయాదవ్‌కు గతంలో ఓ ఇళ్లు అమ్మారు. ఇందుకు సంబంధించి డబ్బులు చెల్లించలేదని కృష్ణయ్యాయాదవ్ బొలెరో వాహనంతో నాగరాజుయాదవ్ తన పొలంలో ఉన్న సమయంలో ఢీకొట్టారు. అప్పట్లో సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. సింహాద్రిపురం మండలంలో కేసు నమోదు కావడంతో కృష్ణయ్య యాదవ్ కొడుకు రైల్వేకోడూరులో కాపురం ఉంటున్నాడు. అతని వద్దకెళ్లి కృష్ణయ్యయాదవ్ ఉంటున్నారు. పింఛన్ కోసం సోమవారం కృష్ణయ్యయాదవ్ వస్తున్న సంగతి నాగరాజుయాదవ్ తెలుసుకొని పథకం ప్రకారం మరో ఇరువురితో కలిసి పులివెందులలోని పూలంగళ్ల సమీపంలోని పాతమార్కెట్ వద్ద కట్టెలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కృష్ణయ్యయాదవ్‌ను చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించగా.. డీఎస్పీ మురళీనాయక్, రూరల్ సీఐ రమణలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణునారాయణ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ..ఇద్దరికి గాయాలు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని అక్కంపేట గ్రామ ఎస్సీ కాలనీలో ఇంటిస్థలం విషయమై గొడవకు పాల్పడటంతో ఇద్దరికి గాయలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు పాణ్యం నాగేంద్ర, రామచంద్ర ఇంటిస్థలం విషయమై తరచూ గొడవలు పడేవారు. ఈ నేపథ్యంలో నాగేంద్ర కొప్పర్తి పారిశ్రామికవాడలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. సోమవారం ఉదయం యదావిధిగా పనికి వెళుతుండగా రామచంద్ర అతనితో గొడవపడ్డాడు. దీంతో ఇరువురు కట్టెలతో దాడి చేసుకోవడంతో ఇద్దరికి రక్తగాయాలయ్యాయి. సమాచారం పోలీసులకు తెలియడంతో ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బాకీ విషయమై ఘర్షణ... వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

దువ్వూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యో): బాకీ విషయమై జరిగిన ఘర్షణలో జేష్ఠాది దివాకర్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వినోద్‌కుమార్ వివరాల మేరకు.. మండలంలోని బీముని పాడు గ్రామంలో దళితవర్గానికి చెందిన దివాకర్‌కు నాగదస్తగిరి బాకీ ఉండడంతో చెల్లించమని అడిగాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య మాటకు మాట పెరగడంతో దస్తగిరి దాడి చేసి దివాకర్ తలపై రాయితో కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో దివాకర్‌ను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తల్లి మరియమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని శవాన్ని డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పరిశీలించారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్లకుంట సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో విద్యుత్‌షాక్‌కు గురై చిన్న గురయ్య (50) అనే కౌలు రైతు మృతి చెందాడు. ఎరసాల దళితవాడకు చెందిన చిన్న గురయ్య ఈర్లకుంట సమీపంలో పొలాలను కౌలుకు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం పొలంలో నీరు కట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు ఆరా తీస్తున్నారు.

పోలీసు విధులకు ఆటంకం.. ఐదుగురిపై కేసు

కడప క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం కొండాయపల్లెలో వినాయక ఉత్సవం సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులను అడ్డుకున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. కొండాయపల్లెలో వినాయక నిమజ్జనం కోసం ర్యాలీగా వెళుతున్న సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై మల్లేశ్వర్‌రెడ్డి మరో నలుగురు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు. దీంతో ఐదుగురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

హోంగార్డు అత్యుత్సాహం

డీజే ఉన్న వాహనం నడపడంతో బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

కడప క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడపనగరం ఓం శాంతినగర్‌లోని వినాయకుని నిమజ్జనం చేసేందుకు వాహనాలతో డీజే వాహనంతో కలిపి ర్యాలీగా వెళుతున్నారు. ఎస్టీవోకాలనీకి రాగానే అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు డీజే ఉన్న ఐచర్ వాహనాన్ని స్పీడ్‌గా నడపమంటూ డ్రైవర్‌కు సూచించాడు. దీంతో డ్రైవరు మీరు చూడండి అంటూ సమాధానం ఇవ్వడంతో ఆ హోంగార్డు డ్రైవరును కిందికి దించి ఐచర్ వాహనాన్ని నడిపాడు. ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని రిమ్స్‌కు తరలించారు. దీంతో కాసేపు విగ్రహ కమిటీ సభ్యులు హోంగార్డు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పెద్దలు సర్ది చెప్పడంతో నిమజ్జనానికి వాహనాలు అక్కడ నుంచి వెళ్లిపోయాయి.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు





నాగచైతన్య (కడప), నయీముల్లా (కర్నూలు)

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్- 23 మెన్స్ మల్టీడే (మూడురోజుల) ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలలో భాగంగా వివిధ జట్ల మధ్య గత మూడురోజులుగా సాగుతున్న మ్యాచ్‌లు సోమవారం డ్రాగా ముగిశాయి. వివారాలిలా..... కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కడప- చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో ఆదివారం ఆటకు చివరి రోజు కడప జట్టు 117.4 ఓవర్లలో 406 పరుగులు చేసింది. ఇందులో నాగచైతన్య 174 పరుగులు చేయగా ఆదిల్ హుస్సేన్ 66 పరుగులు చేశారు. అంతకు ముందు టాస్‌నెగ్గిన కడప జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. రెండవ రోజు తిరిగి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొత్తం 137.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయిన తర్వాత 589 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 32.4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 99 పరుగులు చేసింది. ఆటకు చివరిరోజున తిరిగి 99 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్‌కు దిగి మొత్తం 117.4 ఓవర్లలో 406 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో చిత్తూరు జట్టుకు 183 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించగా మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 82 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 374 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి రెండవ రోజు బ్యాటింగ్‌కు దిగి మొత్తం 96.4 ఓవర్లలో 514 పరుగులకు ఆలౌట్ అయింది. భారీ లక్ష్యాన్ని చేదించే క్రమంలో మొదటి ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు కేవలం 41.5 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టుకు 382 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 54 పరుగులు చేసింది. చివరిరోజు 54 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి బ్యాటింగ్‌కు దిగి 34.2 ఓవర్లలో 138 పరుగులు సాధించి డిక్లేర్ చేసింది. దీంతో రెండు ఇన్నింగ్స్‌లో 520 పరుగుల ఆధిక్యతో పటిష్ట స్థితికి చేరింది. ఇందులో పవన్‌రిత్విక్ 51 పరుగులు సాధించారు. అనంతరం సెకెండ్ ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 63 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. ఇందులో నయీముల్లా 81 పరుగులు, సాయి సూర్య తేజారెడ్డి 62 పరుగులు చేశారు. దీంతో నిర్వాహకులు మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఇన్‌చార్జ్ అధికారిగా కరీముల్లా షరీఫ్



విజిలెన్స్ అధికారికి స్వాగతం పలుకుతున్న సీఐలు నారాయణప్ప, శివన్న

కడప క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఇన్‌చార్జ్ అధికారిగా కరీముల్లా షరీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం తిరుపతి విజిలెన్స్ అధికా రిగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా విజిలెన్స్ అధికారిగా శ్రీనివా సరావు ఇటీవల పదవీ విరమణ పొందడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో తిరుపతి విజిలెన్స్ అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించడంతో ఆ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శాప్ చైర్మన్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప నగర రిమ్స్ సమీపంలో గల స్పోర్ట్స్ స్కూల్‌ను సోమవారం శాప్ చైర్మన్ రవి నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో మమేకమై విద్యతో పాటు వివిధ ఆటలకు సంబంధించిన శిక్షణపై ఆరా తీశారు. అనంతరం వంటశాలకు వెళ్లి అక్కడున్న వంట సామగ్రి, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాలను తనిఖీ చేశారు. అదే సమయంలో వసతి గృహాలు మరమ్మతులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడున్న సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రొద్దుటూరు విద్యార్థులు ప్రతిభ కనపరిచి పతకాలు సాధించారని మాస్టర్ మునీశ్వర్ తెలిపారు. ఆదివారం రాయలసీమస్థాయి తైక్వాండో పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రొద్దుటూరు నుంచి వైఎస్ఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు జవహర్ బాలకేంద్రం విద్యార్థులు పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు ఈనెల 13, 14 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

జర్మన్ నర్సింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించనున్న జర్మన్ నర్సింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని బైరాగిపట్టెడలో ఉన్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్‌హాస్టల్‌లో ఉచితంగా శిక్షణ ఉంటుందన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 20 నుంచి 35 ఏళ్ల లోపు వారు, నర్సింగ్ డిగ్రీ కలిగి ఉండాలన్నారు. జీఎన్ఎం నర్సింగ్ చేసిన అభ్యర్థులు ఒక సంవత్సరం, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు ఆరు నెలలు అనుభవం కలిగి ఉండాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.2.40 లక్షలు నుంచి రూ.3.10 లక్షలు వేతనం ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి 8 నుంచి 10 నెలలు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను కొత్త కలెక్టరేట్ కార్యాలయంలోని డి బ్లాక్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సెప్టెంబరు 4లోపు సమర్పించాలని ఆమె కోరారు.

భారీ వాహనాల డ్రైవింగ్‌కు..

ఎస్సీకార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్త్రీలకు భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఎల్ఎంవీ లైసెన్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించి 20 నుంచి 40 సంవత్సరాల్లోపు వయసు వారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 4లోపు కొత్త కలెక్టరేట్‌లోని డిబ్లాక్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

నాసిరకం విత్తనాలతో మోసపోయాం

- మొక్కజొన్న రైతుల ఆవేదన

ముద్దనూరు సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాసిరకం మొక్కజొన్న విత్తనాలతో మోసపోయామని మండలంలోని శెట్టివారిపల్లె రైతులు సోమవారం ఏవో వెంకటకృష్ణారెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని మదుసాయి ట్రేడర్స్‌లో మే 30వ తేదీ షైసీడ్స్ కంపెనీకి చెందిన సోహో 007 మొక్క జొన్న విత్తనాలు కొనుగోలు చేశామన్నారు. జూన్ 4వ తేదీ విత్తనం వేశామన్నారు. 120 రోజులకు పంట పూర్తవుతుందన్నారు. అయితే 90 రోజులకు కంకి విత్తనాలు రావాలన్నారు. అయితే విత్తనాలు కంకిలో అక్కడక్కడా వచ్చాయన్నారు.

ఎకరాకు దాదాపు రూ.25 వేల నుంచి 30వేలు ఖర్చు చేశామన్నారు. దాదాపు 70 ఎకరాల్లో 30 మంది రైతులు మొక్క జొన్న పంట సాగు చేశామన్నారు. తాడిపత్రిలోని మదుసాయి ట్రేడర్స్ వద్దకు వెళ్లి ఆందోళన చేశామని, అక్కడ వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఏవో వెంకటకృష్ణారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఏవో వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ పంటను శాస్త్రవేత్తలు పరిశీలిస్తారని.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ రద్దు

● ఇబ్బందులు పడ్డ అర్జీదారులు


డీఏవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సోమవారం అధికారులు చెప్పాపెట్టకనే రద్దు చేశారు. మదనపల్లె డివిజన్‌లోని 11 మండలాల నుంచి పలు సమస్యలపై సబ్‌కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు ఇక్కడ పీజీఆర్ఎస్ రద్దు చేయడంతో ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని రాజంపేట మండలం బోయినపల్లెలో సీఎం చంద్రబాబు పర్యటన వుండడంతో రాయచోటి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పత్రికా ప్రకటన ఇచ్చారు. కాని మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించలేదు. ఈ విషయం తెలియని అర్జీదారులు దూర ప్రాంతాల నుంచి వచ్చి వెనుదిరిగి వెళ్లారు. కాగా సబ్‌కలెక్టరేట్ డీఏవో నిర్మలాదేవికి 10 మంది అర్జీలు ఇచ్చారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

● ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, ఈఎస్ఐతో కూడిన సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ, ఆటోడ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముబారక్ డిమాండ్ చేశారు. సోమవారం బి.కొత్తకోట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆటోడ్రైవర్లతో కలిసి నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జీవోనంబర్ 21, 31 లను రద్దు చేయాలన్నారు. ఈ నెల 16న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు.

గురువు ఉత్తమ సమాజ నిర్మాత


నాగరాజును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నరసింహారెడ్డి, గంటా మోహన్ తదితరులు

మదనపల్లె, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గురువు ఉత్తమ సమాజ నిర్మాతనని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కన్నెమడుగు నాగరాజు పదవీ విరమణ కార్యక్రమం టీటీడీ కళ్యాణమండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ గురువు అంటే చీకటిని పారద్రోలి విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపేవారన్నారు. నాగరాజు గురువుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో గాజుల నాగేశ్వరరావు, గంటా మోహన్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా సుధాకర్‌రెడ్డి

పీలేరురూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.సుధాకర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తూ పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా చేరారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఉత్తీర్ణతా శాతం పెంచడం ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కళాశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కాగా ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌రెడ్డిని కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు.

మళ్లీ రావయ్యా.. బొజ్జ గణపయ్యా...




నిమ్మనపల్లె : నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు, మదనపల్లె అర్బన్ : చౌడేశ్వరీనగర్‌లో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు, వాల్మీకిపురం: భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

నిమ్మనపల్లి/పెద్దతిప్పసముద్రం/తంబళ్లపల్లె/కురబలకోట/మదనపల్లెఅర్బన్/రామసముద్రం/వాల్మీకిపురం/ సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గణేశుడి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం మళ్లీ రావయ్యా.. బొజ్జ గణపయ్యా.. అంటూ నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిమ్మనపల్లెలోని స్థానిక వెంకోజిగారిపల్లి అంబేద్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బళ్లారి డ్రమ్స్, బాజాభజంత్రీల మధ్య వీధుల్లో జై గణేష్ అంటూ నినాదాలు చేసి ఊరేగించారు. పెద్దతిప్పసముద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని ఉదయం నుంచి పురవీధుల్లో మేళతాళాలు, మంగళావాయిద్యాలు, కోలాటలు, చెక్కభజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా నడుమ బొజ్జ గణపయ్యను కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. తంబళ్లపల్లె మండల కేంద్రంలోని పాత కళాశాల మైదానంలో గణేష్ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన మండపం వద్ద వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. మండపం వద్ద రిటైర్డ్ టీచర్ అరుణకుమారి, ప్రభాకరరావు దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇక కురబలకోట మండలంలోని అంగళ్లు, కురబలకోట, ముదివేడు, చేనేతనగర్ తదితర గ్రామాల్లో వినాయకుడి ప్రతిమలను ప్రత్యేకంగా ఊరేగించారు. మదనపల్లెలోని నక్కలదిన్నే తాండా, వడ్డిపల్లె, వివేకానంద నగర్, శేషమహల్ ఏరియా, గాంధీపురం, సొసైటీ కాలనీ, నీరుగుట్టవారిపల్లె, చౌడేశ్వరీనగర్, మున్నెప్పకాలనీ, రామిరెడ్డి లేఅవుట్, తదితర ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను మేళ తాళాలతో బాణాసంచా పేలుళ్ల నడుమ నిమజ్జనానికి తరలించారు. రామసముద్రం మండలం లోని చొక్కాండ్లపల్లె గ్రామ పంచాయతీ పురాండ్లపల్లె గ్రామంలో చవితి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలంపాట నిర్వహించారు. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా గణేష్ ఉత్సవ వేడుకలను వైభవంగా జరుపుకుంటున్నారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో వినాయకుల విగ్రహాల చెంత పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

త్వరలో మంచి రోజులు వస్తున్నాయ్

● టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి


తాకాటంవారిపల్లెలో ప్రజల సమస్యలు వింటున్న జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీకి త్వరలో మంచిరోజులు రాబోతున్నాయని, సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి ఊపందుకుంటుందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరపంచాయతీ పరిధిలోని తాకాటంవారిపల్లిలో ఆయన పర్యటించారు. గ్రామస్థులతో మమేకమై వారి సమస్యలను విన్నారు. పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. తమకు పించన్లు తీసేశారని కొందరు, మంజూరు కాలేదని మరికొందరు తమ గోడును వెళ్లబోసుకున్నారు. అధ్వానంగా వున్న సీసీరోడ్లు, డ్రైనేజిని నిర్మించాలని గ్రామస్థులు జయచంద్రారెడ్డికి విన్నవించడంతో ఆయన పైవిధంగా స్పందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ పల్లవి, ఏపీఎం రాజేశ్వరి, నాయకులు బంగారు వెంకట్రమణ, డేరంగుల నారాయణ, గంజిమోహన, ఓబులేసు, లోకనాథరెడ్డి, శివరాం, చావిడి కిట్టన్న, ప్రభాకర్, రామదాసు, మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు: పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మద్దినాయనిపల్లెలో సోమవారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ, మాజీ సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, రమణారెడ్డి, నాయకులు శ్రీనివాసులు, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థికి బంగారు పతకం

సిద్దవటం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైల్వేకోడూరులో నిర్వహించిన రాయలసీమ స్థాయి తైక్వాండో పోటీల్లో ఎస్.రాజంపేట గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన బావ నాసి సుశాంత్ అనే విద్యార్థికి జోనల్‌స్థాయిలో బంగారు పతకం లభించింది. అతను చదువుతున్న భారతి స్కూల్ ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు అభి నందించారు.

కురవంక సెక్రటరీకి సీఎం ప్రశంసలు


మణికుమార్‌ను ప్రశంసిస్తున్న సీఎం చంద్రబాబు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శిగా కురవంక కార్యదర్శి మణికుమార్ అందించిన సేవలకు సీఎం చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. సోమవారం రాజంపేట పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు అక్కడ పంచాయతీరాజ్‌శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రదర్శనలో మణికుమార్ నైపుణ్యాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు మణికుమార్‌ను భుజం తట్టి ప్రశంసించారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా మణికుమార్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్నారని సీఎంకు వివరించారు. దీంతో సీఎం చంద్రబాబు కురవంక పంచాయతీ కార్యదర్శి మణి కుమార్‌ను మరోసారి ప్రశంసించారు.

రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలి


వన్‌టౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు పులిరెడ్డి నరేంద్రకుమార్‌రెడ్డి వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ తల్లిపై అనుచిత భాషను వాడినందున ముందుగా అనిబిసెంట్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధురాలు, స్త్రీమూర్తిపై అవమానకరమైన భాష మాట్లాడడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దూషణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో శ్యాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, పి.భగవాన్, బండి ఆనంద్, కిరణ్‌కుమార్, పూల నాగరాజు, ఓనూరి కిరణ్‌కుమార్, జర్మనీ రాజు, జేకే వర్మ, బాలజ్యోతి పాల్గొన్నారు.

పింఛన్లపై అపోహలు నమ్మొద్దు

వాల్మీకిపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ పట్ల వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలు, అపోహలు నమ్మొద్దని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ఆయన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి పింఛను నగదును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కోసూరి చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఓట్ చోర్ గద్దీ చోడ్' ర్యాలీ

వాల్మీకిపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓట్‌చోర్ గద్దీ చోడ్ ర్యాలీ చేపట్టారు. స్థానిక మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీజేపీ ఓటు దొంగతనం చేసి అధికారంలోకి వచ్చినట్లు ఆధారాలతో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బెంగళూరులో జరిగిన కార్యక్రమం ద్వారా దేశ ప్రజల ముందు ఉంచారన్నారు. అనంతరం పురవీధుల గుండా నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కమిటీ ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణరెడ్డి, మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా, జిల్లా కేకేసీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇదాయతుల్లా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల విభజనను చేపట్టాలి

● సీపీఐ నేతల నిరసన

ములకలచెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల విభజనను సరిగా చేపట్టాలని మండల సీపీఐ కార్యదర్శి అంజనప్ప, సహాయ కార్యదర్శి నిజాముద్దీన్‌లు డిమాండ్ చేశారు. గ్రామాల విభజనను సక్రమంగా చేపట్టాలని సోమవారం సీపీఐ నాయకులు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల విభజనను అడ్డగోలుగా చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఎంపీడీవో హరినారాయణ, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మిలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పుబ్బన్న, రెడ్డెప్ప, జయకర్, జయశేఖర్, రామచంద్ర పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీలో మొదటిస్థానం

నిమ్మనపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెన్షన్ పంపిణీలో నిమ్మనపల్లి మండలానికి జిల్లాలో మొదటి స్థానం దక్కిందని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 5061 పెన్షన్‌లు వుండగా సచివాలయ సిబ్బంది ఉదయం నుంచి పెన్షన్ పంపిణీని ప్రారంభించారని, మధ్యాహ్నానికి 95 శాతం కాగా సాయంత్రం వరకు 96 శాతం సాధించినట్లు తెలిపారు. పెన్షన్ తీసుకోని లబ్ధిదారులు 2వ తేది సచివాలయాల వద్ద తీసుకొవాలని తెలిపారు. అదేవిధంగా చెత్త సేకరణను విధిగా ప్రతి రోజు నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

పెరటి తోటల పెంపకం చేపట్టాలి

● ఉద్యాన అధికారి సుకుమార్‌రెడ్డి

పీలేరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పెరటి తోటల పెంపకంపై ప్రత్యేక చొరవ చూపాలని మండల ఉద్యాన శాఖ అధికారి సుకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఒంటిల్లు వద్ద పెరటితోటల పెంపకంపై మహిళా రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విపరీతంగా ఎరువులు, పురుగు మందులు వాడి పండించిన కూరగాయలు, ఇతర ఉత్పత్తులను వినియోగించడం వల్ల తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నామని తెలిపారు. అనంతరం 50 మందికి పెరటితోట విత్తనాల మినీ కిట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం జోత్స్న, వెలుగు సీసీ చంద్ర కళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే కూటమి లక్ష్యం

● ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి


పెన్షన్లు అందిస్తున్న ఆర్టీసీ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ కావడంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని మదనపల్లె ఆర్టీసీ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి పేర్కొన్నారు. సోమవారం ఒకటో తారీకున 14 మున్సిపల్ వార్డులో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఓ పక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరోపక్క ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమాలు అందుతున్నాని చెప్పారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరల విక్రయాలపై తనిఖీ


తనిఖీ చేస్తున్న ఎంఏవో హేమలత

కలికిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధిక ధరలతో యూరియా విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మండల ఏవో హేమలత యూరియా స్టాకు అందుబాటులో వున్న దుకాణాల్లో ప్రస్తుత స్టాకు పరిస్థితి, విక్రయించిన యూరియా బస్తాల ధరల వివరాల గురించి ఆరా తీశారు. కలికిరిలోని అలీ ట్రేడర్స్, మేడికుర్తిలోని నవాబ్‌జాన్ ఫెర్టిలైజర్ దుకాణాల్లో స్టాకు రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, ఈపోస్ యంత్రం ద్వారా జరిపిన విక్రయాలు, ప్రస్తుత నిల్వల గురించి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. గత శని, ఆదివారాల్లో ఈ దుకాణాల్లో యూరియాను అధిక ధరలకు విక్రయించారని వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా విచారించారు. ఇక ఎరువుల ధరలకు సంబంధించిన వివరాలు బహిరంగంగా ప్రదర్శించి తీరాలని హేమలత డీలర్లకు స్పష్టం చేశారు. ఇక మీదట బహిరంగంగా ధరల వివరాలు ప్రదర్శించకున్నా, అధిక ధరలకు విక్రయించినా, నిబంధనలను అతిక్రమించినా దుకాణాలను సీజ్ చేసి లైసెన్సులను రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు.

వాల్మీకిపురంలో రోడ్ల తీరు చూడండయ్యా...!

రోడ్లంతా గుంతలమయం ● అవస్థలు పడుతున్న జనం



వాల్మీకిపురం-తిరుపతి రోడ్డులో గుంతలమయంగా రహదారి, (ఇన్‌సెట్లో) రైల్వేగేటు వద్ద రోడ్డుపై గోతుల చెంత వాహనాల అవస్థలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పట్టణం గుండా తిరుపతికి వెళ్లే మార్గంలో పెట్రోల్ బంకు చెంత రహదారి గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లపై గోతులలో నీరు చేరిపోవడం అదికాస్తా గమనించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక నాయక్‌వీధిలోని రైల్వే గేటు ప్రాంతం గుంతలు పడిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణం నుంచి నిమ్మనపల్లెకు వెళ్లేమార్గంలో రోడ్ల గోతులు గమనిస్తే సరి లేదంటే అంతే మార్గం తెలియని వాహనాలు ఈ ప్రాంతంలోని గోతుల వెంబడి అవస్థలు పడుతూ వెళ్లాల్సిందే. నిత్యం బోయకొండకు ఈ మార్గం గుండానే వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే విధంగా మండలంలోని చింతపర్తి, గుండబోయనపల్లె, బూడిదవేడు, నగిరిమడుగు, సాకిరేవుపల్లె, మంచూరు గుండ్లూరు తదితర ప్రాంతాలలో రోడ్లు దెబ్బతిని గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని పట్టణంతో పాటు గ్రామీణ గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుకుంటున్నారు.